మిమ్స్ ఉద్యోగుల ఆందోళన తీవ్రతరం

- ర్యాలీ, రహదారిపై బైఠాయింపు
- 150 మంది అరెస్టు, విడుదల

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 239 | విజయవాడ, బుధవారం 3 ఏప్రిల్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 3 April 2024 | Rs

మయాంక్ మాయ

- బెంగళూరుపై 28 పరుగుల తేడాతో నెగ్గిన లక్నో

6

ఒక ఐజి ముగ్గురు ఐఎఎస్‌లు ఐదుగురు ఎస్‌పిలపై

ఇసి వేటు

తక్షణమే బాధ్యతల నుండి వైదొలగాలి • ముగ్గురు సభ్యుల ప్యానెల్ లిస్ట్ పంపాలని ఆదేశం

గౌతమి (అనంతపురం కలెక్టర్)

రాజబాబు(కృష్ణా కలెక్టర్)

లక్ష్మీషా (తిరుపతి కలెక్టర్)

పాలరాజు (ఐజి)

పరమేశ్వర్‌రెడ్డి(ఒంగోలు)

అన్బురాజన్ (అనంతపురం)

జాషువా(చిత్తూరు ఎస్‌పి)

తిరుమలేశ్వర్(నెల్లూరు)

రవిశంకర్ (పల్నాడు)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగానూ పలువురు ఉన్నతాధికారులపై బదిలీ వేటు వేసింది. తమ తరువాత స్థాయి అధికారులకు తక్షణమే బాధ్యతలను అప్పగించి వీరు విధుల నుండి తప్పుకోవాలని ఆదేశించింది. ఎన్నికల విధులకు వీరందరిని దూరంగా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం జారీ చేసిన ఈ ఆదేశాలు కలకలం రేపాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఇంత పెద్ద సంఖ్యలో ఉన్నతాధికారులపై ఇసి చర్యలు తీసుకోవడం ఇదే మొదటిసారి. సిఇసి చర్యలు తీసుకున్న వారిలో గుంటూరు రేంజ్ ఐజి పాలరాజు కూడా ఉన్నారు. ఎస్‌పిలు పరమేశ్వరరెడ్డి (ఒంగోలు), వై.రవి శంకర్‌రెడ్డి (పల్నాడు), పి.జాషువా (చిత్తూరు), ఎస్‌పి కెకె అన్బురాజన్ (అనంతపురం) కె.తిరుమలేశ్వర్ (నెల్లూరు) వేటు పడిన వారి జాబితాలో ఉన్నారు. ప్రధాని సభలో భద్రతా వైఫల్యానికి సంబంధించి కూడా వీరిలో కొందరిపై ఇసి చర్యలు తీసుకుంది. మొత్తంమీద ఆరుగురు ఐపిఎస్ అధికారులపై ఇసి వేటు వేసింది. ఓటర్ల జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగానూ జిల్లా ఎన్నికల అధికారులుగా ఉన్న ముగ్గురు కలెక్టర్లపై కూడా ఎన్నికల కమిషన్ వేటు వేసింది. కృష్ణా జిల్లా కలెక్టర్ రాజబాబు, అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి, తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీషా ఈ జాబితాలో ఉన్నారు. ఈ చర్యలను తక్షణమే తీసుకోవాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇసి అత్యవసర నోటీసు పంపింది. వీరి స్థానాలో ప్రత్యామ్నాయ అధికారుల నియమాకం కోసం ముగ్గురు పేర్లతో మంగళవారం నాడే ప్యానల్ లిస్ట్‌ను పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వేటుకు గురైన అధికారులను ఎన్నికలతో సంబంధం లేని పోస్టుల్లోకి బదిలీ చేయాలని రాష్ట్ర సిఇఓకు ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను సిఎస్, డిజిపికి సిఇఓ పంపారు.

వేటు ఎందుకు...?

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో కొన్ని అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. వీటిని ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుంది. సంబంధిత ఎస్‌పిలను సిఇఓ ముఖేష్‌కుమార్ నేరుగా పిలిపించి వివరణ తీసుకున్నారు.

ప్రధాన మంత్రి సభలో సెక్యూరిటీ లోపాలపై గుంటూరు రేంజ్ ఐజి జి.పాలరాజు పల్నాడు ఎస్‌పి రవిశంకర్‌రెడ్డిలపై ఇసి వేటు వేసింది. ఓటర్ల జాబితాలో నిర్లక్ష్యంపై అనంతపురం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి, జిల్లా ఎస్‌పి అన్బురాజన్ అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో పాటు, ఉరవకొండ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినా పట్టించుకోలేదంటూ ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారు. ప్రకాశం జిల్లాలో జరిగిన ఒక రాజకీయ హత్యకు సంబంధించి అక్కడి ఎస్‌పిపై చర్య తీసుకున్నట్లు సమాచారం. నెల్లూరు, చిత్తూరు ఎస్‌పిలు కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగానూ, ఏకపక్షంగానూ వ్యవహరించినట్లు ఇసికి ఫిర్యాదులు అందాయి.

1,000 మందిపై చర్యలు : ముఖేష్‌కుమార్ మీనా

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకుగానూ రాష్ట్రంలో ఇప్పటివరకు వెయ్యి మందిపై చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. తనన కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ చర్యలు తీసుకున్న వారిలో 556 మంది వాలంటీర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికల నియమావళికి భిన్నంగా ఒక పార్టీకి ప్రచారం చేస్తున్నందుకుగానూ వీరిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రేషన్ షాపులు నిర్వహణ తదితర ప్రభుత్వ అనుబంధ కార్యక్రమాల్లో ఉన్న మరో 61 మంది రాజకీయ ప్రచారాలు, ప్రదర్శనల్లో పాల్గొన్నట్లు తేలడంతో వారిపై కూడా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో ఉద్యోగాలు చేస్తున్న 140 మందిని విధుల నుండి తొలగించినట్లు తెలిపారు. 96 మంది రెగ్యులర్ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, వీరిలో కొందరిని సస్పెండ్ చేసినట్లు సిఇఓ తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు ఖచ్చితంగా పాటించాలని ఆయన కోరారు.

వికలాంగులు, రోగులకు ఇళ్ల వద్దకే పింఛను

- ఇతరులకు సచివాలయం వద్ద
- నేటి నుంచి పంపిణీ
- నూతన మార్గదర్శకాల విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వికలాంగులకు, తీవ్ర అనారోగ్యంతో బాధపడే రోగులకు ఇళ్లవద్దకే పింఛను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఖరారుచేసిన మార్గదర్శకాలను మంగళవారం ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో బుధవారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సిఇఒ తొలుత జారీ చేసిన ఆదేశాలను సవరిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ విధివిధానాలను రూపొందించింది. పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఈ మేరకు తాజా సర్క్యులర్‌ను సెర్ప్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఆర్‌డిఎ పిడిలు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిష నర్లకు పంపించారు. వీటి ప్రకారం లబ్ధిదారులను రెండు విభాగాలుగా విభజించారు. వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారు మంచాలకు, కుర్చీలకే పరిమితమైన వృద్ధులు, ఇంటి నుంచి బయటకు రాలేని వారిని మొదటి విభాగంలో చేర్చారు. వీరికి సచివాలయ లేదా ఇతర ప్రభుత్వ సిబ్బంది ఇళ్ల వద్దకే వచ్చి పింఛను అందిస్తారు. మిగిలిన లబ్దిదారులు గ్రామ/వార్డు సచివాలయం వద్దకు వెళ్లి పింఛను తీసుకోవాల్సి ఉంటుంది.

ఆధార్ తప్పనిసరి...!

సచివాలయం వద్దకు వెళ్లి పింఛను తీసుకునే లబ్ధిదారులు తమతోపాటు తప్పనిసరిగా ఆధార్‌కార్డును తీసుకురావాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11 గంటల తర్వాత పింఛన్ల పంపిణీని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలని, 6వ తేదీ నాటికి ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని తెలిపారు. దీనికోసం రాష్ట్రంలోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పని చేయాలని, పింఛన్ల పంపిణీ పూర్తయ్యే వరకూ అన్ని సచివాలయాలు ఈ సమయాన్ని ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. లబ్ధిదారులకు వడదెబ్బ తగలకుండా స్థానిక పరిపాలనా సంస్థలే ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పంచాయతీలు, పట్టణాల్లో మున్సిపాల్టీలు సచివాలయాల వద్ద తాగునీరు, కూర్చునేందుకు బల్లలు, నీడ కోసం టెంట్‌లు, తదితరాలను ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది. పింఛన్ల పంపిణీ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని, పింఛను దారులకు పింఛన్ అందజేస్తున్నట్లుగా ఫోటోలు దిగటం, ఇతర ప్రచార కార్యక్రమాలు చేయకూడదు, ఒకవేళ ఎవరైనా హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డిబిటి సాధ్యం కాదు

వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకూడదంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించటంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పింఛన్లను పంపిణీ చేయాలని రాష్ట్రంలో వివిధ రాజకీయ పక్షాలు పలు దఫాలుగా ప్రభుత్వ యంత్రాంగానికి సూచించాయి. ఒక వేళ అలా కాని పక్షంలో డైరెక్టు బెనిఫిట్ (డిబిటి) పద్ధతిలోనైనా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో పింఛను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశాయి.ఇది సాధ్యం కాదని కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. బ్యాంకు ఖాతాల్లో తప్పులు, ఇతర సమస్యల వల్ల సాధ్యపడదని ప్రభుత్వం పేర్కొంది. సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1,27,177 సచివాలయ ఉద్యోగుల్లో (12,770 ఎఎన్ఎం, 14,232 అగ్రికల్చర్, ఇతర ఉద్యోగులు కలుపుకుని) చాలామందికి ఎన్నికల విధులు కేటాయించారని తెలిపింది.

ఇడుపులపాయలో ప్రార్థనలు చేస్తున్న వైఎస్ విజయమ్మ, చిత్రంలో షర్మిల తదితరులు

కడపలో షర్మిల

- రాష్ట్రంలో 5 లోక్‌సభ, 114 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన
- అలాగే ఒడిషా, బీహార్, బెంగాల్‌లో మరో 12 ఎంపీ స్థానాలకు కూడా

ప్రజాశక్తి అమరావతి బ్యూరో

కడప లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆ పార్టీ తరపున పోటీ చేయనున్నారు. కడపతో బాటు అయిదు లోక్‌సభ స్థానాలకు, 114 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించింది. ఎఐసిసి ఆదేశాల మేరకు పిసిసి అధ్యక్షులు షర్మిల మంగళవారం ఇడుపులపాయలో ఈ జాబితాను విడుదల చేశారు. మిగిలిన స్థానాలకు సంబంధించి త్వరలో మరో జాబితా విడుదల చేసేందుకు ఎఐసిసి, ఎపిసిసి సన్నాహాలు చేస్తున్నాయి. దీంతోబాటే ఒడిశా(8) , బీహార్ (3), బెంగాల్(1)లోని మరో 12 లోక్‌సభ స్థానాలకు కూడా కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు తారిఖ్ అన్వర్ బీహార్‌లోని కటిహార్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. మన రాష్ట్రంలో తొలి జాబితాలో కడప లోక్‌సభతో బాటు కాకినాడ (ఎంఎం పల్లంరాజు) రాజమండ్రి(గిడుగు రుద్రరాజు), బాపట్ల (, జేడి శీలం) కర్నూలు (పిజి రామ్‌పుల్లయ్య యాదవ్) స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటించింది. -వివరాలు 2,3 పేజీల్లో

24 నుంచి వేసవి సెలవులు

- జూన్ 12న పాఠశాలలు పున:ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 24 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించినట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలు తిరిగి జూన్ 12న పున:ప్రారంభమవుతాయని తెలిపారు. అలాగే పాఠశాలల్లో వాటర్‌బెల్ కార్యక్రమం అమలు చేయాలని సురేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు డిఇఒలకు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు డీ హైడ్రేషన్‌కు గురికాకుండా రోజుకు మూడుసార్లు (ఉదయం 8:45, 10:05, 11:50 గంటలకు) వాటర్ బెల్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పకుండా నీరు తాగేలా ప్రధానోపాధ్యాయులు సూచించాలని పేర్కొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థులకు లంచ్ బ్రేక్ ఇచ్చినట్లు ఐదు నిమిషాలపాటు వాటర్ బ్రేక్ ఇచ్చే విధానాన్ని దేశంలోనే తొలిసారిగా కేరళలోని కొన్ని బడుల్లో 2019లో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. మంచి స్పందన రావడంతో అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేస్తున్నారు.

నెత్తురోడుతున్న దండకారణ్యం

- వేర్వేరు ఘటనల్లో 11 మంది మావోయిస్టుల కాల్చివేత
- ఈ ఏడాదిలో 43 మంది ఎన్‌కౌంటర్

'ప్రజాశక్తి విలేకరి- చింతూరు)

దండకారణ్యం నెత్తురోడుతోంది. రెండు వేర్వేరు సంఘటనల్లో 11 మంది మావోయిస్టులను పోలీసులు కాల్చిచంపారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఒక సంఘటనలో తొమ్మిది మంది మావోయిస్టులు మరణించగా, సోమవారం రాత్రి జరిగిన మరో సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మావోయిస్టుల వేటను ముమ్మరం చేసింది. ఈ ఏడాదిలో ఒక బస్తర్ ప్రాంతంలోనే ఏకంగా 43 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో హతమార్చింది. బస్తర్ ఐజి సుందర్‌రాజ్ చెప్పిన వివరాల ప్రకారం జాపుర్ జిల్లా లెంద్రా గ్రామ సమీపంలోని ఓ అడవిలో మంగళవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో భద్రతాదళాల సంయుక్త బృందం మావోయిస్టుల కోసం గాలింపు జరుపుతుండగా ఎదురు కాల్పులు జరిగాయి. మావోయిస్టు సీనియర్ నాయకుడు పాపారావు ఉనికికి సంబంధించిన సమాచారం అందడంతో భద్రతాదళాలు గాలింపు చర్యలు చేపట్టాయని, ఈ సందర్భంగా ఎదురుకాల్పులు జరిగాయని ఆయన చెప్పారు. బస్తర్ లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న తొలి దశలోనే పోలింగ్ జరగనుంది. గత నెల నుండే మావోయిస్టులు తమ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. సాధారణంగా మార్చి-జూన్ మధ్యకాలంలో భద్రతాదళాలపై ఎక్కువ దాడులు జరుగుతుంటాయి. గత నెలలో బీజపూర్‌లోని బసగుడా ప్రాంతంలో భద్రతాదళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావో యిస్టులు చనిపోయారు.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో దబ్రీ పిట్కాన్ సమీపంలోని కేరజారి దండకారణ్యంలో సోమవారం రాత్రి జరిగిన మరో సంఘటనలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఘటనల్లో నిందితురాలిగా ఉండి రూ.29 లక్షలు రివార్డ్ గల డివిసిఎం సజంతి అలియాస్ క్రాంతి, రూ.14 లక్షల రివార్డుతో మావోయిస్టు రఘు అలియాస్ షేర్ సింగ్ ఎసిఎం మృతదేహాలను సంఘటనా స్థలంలో స్వాధీనం చేసినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి.

చెల్లాచెదురుగా పడి ఉన్న మావోయిస్టుల మృతదేహాలు



పోలీసులకు లభ్యమైన ఆయుధ సామగ్రి

తప్పుడు ప్రకటనలపై తలొంచిన రాందేవ్ బాబా

- సుప్రీంకోర్టులో బేషరతుగా క్షమాపణ
- పదేపదే ఉల్లంఘనలపై ధర్మాసనం ఆగ్రహం

న్యూఢిల్లీ : దేశంలోనే అత్యంత వివాదస్పద ఉత్పత్తులను తప్పుడు ప్రచారంతో జనంపై రుద్దుతున్న యోగా గురు రాందేవ్ బాబా సుప్రీంకోర్టులో మంగళవారం వ్యక్తిగతంగా హాజరై బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఇక మీదట ఉల్లంఘనలకు పాల్పడబోమని చెప్పారు. ఆయన అనుచరుడు, పతంజలి ఆయుర్వేద సంస్థ మేనేజింగ్ డైరెక్టరు బాలకృష్ణ కూడా సుప్రీంకోర్టులో క్షమాపణలు చెప్పారు. కోవిడ్ నివారణి అంటూ విపత్తు సమయంలోనూ, ఆ తర్వాత కూడా అనేక ఉత్పాధనలపై తప్పుడు ప్రచారం చేసి మార్కెట్లోకి ప్రవేశపెట్టిన వీరిద్దరి తీరుపై సుప్రీంకోర్టు ఇదివరకే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన వారి వైఖరిలో మార్పు రాకపోవడం, సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్లలోనూ తప్పుడు సమాచారం పొందుపర్చడంతో సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం కూడా తీవ్ర ఆగ్రహం మిగతా 5లో

పేదల భవిష్యత్తు తేల్చే ఎన్నికలివి

- ఆ ముగ్గురూ కూటమిగా వస్తున్నారు
- వారిని చిత్తు చేయండి
- మదనపల్లె 'మేమంతా సిద్ధం' సభలో ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఇవి ఎమ్మెల్యేలకు, ఎంపీల గెలుపునకు సంబంధించిన ఎన్నికలు కావని, పేదల భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలని గుర్తుంచుకోవాలని వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 66 లక్షల మంది వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళల పింఛన్ల నిలుపుదలకు టిడిపి అధినేత చంద్రబాబు పన్నాగం పన్నారని విమర్శించారు. మంగళవారం ఆయన అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని టిప్పు సుల్తాన్ మైదానంలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభలో మాట్లాడారు. రాష్ట చరిత్రలో ఎన్నడూ చూడని రీతిలో సంక్షేమ పాలన సాగించామని, కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమాన్ని అందించామని అన్నారు. రాష్ట్రంలోని ఏ గ్రామానికి వెళ్లినా సచివాలయాలు మొదలుకుని ఆర్‌బికెలు, విలేజ్ క్లినిక్‌లు, ఇంటింటికీ మందులు, ఇంగ్లీషు మీడియం చదువులు, ట్యాబ్‌లు, డిజిటల్ బోధన, కనిపిస్తాయని, బాబు హయాంలో చెప్పుకోవడానికి ఎటువంటి ట్రేడ్ మార్క్ లేదని వివరించారు. రాష్ట్రంలో నాలుగు లక్షల ఉద్యోగాలు ఉండేవని, వైసిపి అధికారంలోనికి వచ్చాక అదనంగా 2.30 లక్షల శాశ్వత ఉద్యోగాలను కల్పించామని, అక్కచెల్లెమ్మల చేతిలో 31 లక్షల ఇళ్ల పట్టాలను పెట్టామని వివరించారు. 17 మెడికల్ కళాశాలలు, ఏడు సీపోర్టులు, పది షిప్పింగ్ హార్బర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 2014 ఎన్నికల తరహాలో చంద్రబాబు... పవన్, మోడీలతో ప్రస్తుత ఎన్నికల్లో మళ్లీ కూటమి కట్టి మరోసారి మిగతా 2లో

'మేమంతా సిద్ధం' సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్

బిజెపిలో చేరకుంటే అరెస్టులేనట !

మీడియాతో మంత్రి అతిషి • ఆప్ ఎంపి సంజయ్ సింగ్‌కు బెయిలు

ఆప్ మంత్రి అతిషి

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

బిజెపిలో చేరకుంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వేధింపులు తప్పవని, అరెస్టులు కూడా ఉంటాయని ఆ పార్టీ నేతలు తమను బెదిరించినట్లు ఆమాద్మీ పార్టీ నేత, ఢిల్లీ మంత్రి అతిషి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆమాద్మీ పార్టీ నేతలను బిజెపి లక్ష్యంగా చేసుకుందని పేర్కొన్నారు. తనతో పాటు ఆప్ నేతలు సౌరభ్ భరద్వాజ్, దుర్గేష్ పాఠక్, రాఘవ్ చద్దాలను అరెస్టు చేసే అవకాశం ఉందని తెలిపారు. తమ నివాసాల్లో త్వరలోనే ఇడి దాడులు జరుగుతాయని, అనంతరం తమను అదుపులోకి తీసుకుంటారని చెప్పారు.

"అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ తరువాత ఆప్ పడిపోతుందని బిజెపి ఊహించింది. కానీ రాంలీలా మైదాన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతిపక్ష పార్టీలు ఒక్కటవడాన్ని చూసి వారు బెంబేలెత్తుతున్నారు. త్వరలోనే మాకు సమన్లు? జారీ చేస్తారు. ఆపై జైల్లో పెడతారు. అయినా మేము ఇటువంటి వాటికి బెదిరేది లేదు. మా చివరి శ్వాస వరకు కేజ్రీవాల్‌తోనే ఉంటాం. కలిసి పోరాడతాం. అందరినీ జైలులో పెట్టనివ్వండి. అక్కడి నుంచే మా ఉద్యమాన్ని కొనసాగిస్తాం" అని అతిషీ అన్నారు.

ఆప్ ఎంపి సంజయ్ సింగ్‌కు బెయిల్

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆప్ నేత, ఎంపి సంజయ్ సింగ్‌కు ఆరు నెలల తరువాత బెయిలు మంజూరైంది. ఇదే కేసులో ఆప్ కన్వీనర్, ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ తీహార్ జైలుకు తరలించిన 24 గంటల్లోనే ఈ పరిణామం చోటు చేసుకుంది ఆయనను ఇక కస్టడీలో ఉంచాల్సిన అవసరం లేదని ఇడి చెప్పడంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ ప్రసన్న బి వరలేలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆయనకు బెయిలు మంజూరు చేసింది. అయితే ట్రయల్ కోర్టు ఇచ్చిన షరతులు అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ కేసులో గతేడాది మిగతా 5లో

ఉత్పత్తిలో స్టీల్‌ప్లాంట్ ప్రగతి

- అయినా కేంద్ర ప్రయివేటీకరణ చర్యలతో గడ్డు పరిస్థితి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ముడి సరుకు లేమి, వివిధ రకాల సవాళ్లు ఎదురైనప్పటికీ 2023 –24 ఆర్థిక సంవత్సరంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిలో మెరుగైన ప్రతిభనే కనబరిచింది. గత సంవత్సరం కంటే మంచి ఉత్పత్తిని సాధించింది. ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా వాటిని పోరాటాలతో తిప్పికొడుతూ కార్మికవర్గం శ్రమించడంతోనే ఉత్పత్తి పెరిగింది. అయినప్పటికీ కేంద్ర ప్రయివేటీకరణ చర్యలతో ఆర్థికంగా గడ్డు పరిస్థితినే ఎదుర్కొంటోంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది అధిక వృద్ధిని సాధించినట్లు విశాఖ ఉక్కు యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో 7,30,000 టన్నుల వైర్ రాడ్ కాయిల్స్ ఉత్పత్తి చేసింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 43 శాతం అధికం. ఈ ఏడాది ఐదు లక్షల ఎనిమిది వేల టన్నుల స్ట్రక్చరర్స్ ఉత్పత్తి చేసింది. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ. ఈ ఏడాది 13 లక్షల 24 వేల టన్నుల విలువ ఆధారిత ఉక్కు అమ్మకాలు జరిగాయి. ఇదొక సరికొత్త రికార్డు. ఈ విలువ ఆధారిత ఉక్కు అమ్మకాల్లో గత ఏడాదితో పోలిస్తే 37 శాతం వృద్ధి నమోదైందని ప్లాంట్ యాజమాన్యం పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం 15 శాతం వృద్ధి సాధిస్తూ 43 లక్షల 12 వేల టన్నుల సేలబుల్ స్టీల్ విక్రయాలను ప్లాంట్ నమోదు చేసింది. మార్కెట్ మందగమనం, ముడి పదార్థాలు అందుబాటులో లేకపోవడం వంటి అనేక సమస్యలు ఎదురైనప్పటికీ రూ.23,129 కోట్ల విక్రయాల టర్నోవర్‌ను నమోదు చేసింది. గత సంవత్సరంతో పోలిస్తే రెండు శాతం వృద్ధి ఇక్కడ నమోదైంది. డోర్ డెలివరీ ప్రతిపాదన మేరకు 90 వేల టన్నుల స్టీల్‌ను పంపిణీ చేశారు. వివిధ సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ స్టీల్‌ప్లాంట్ గత ఆర్థిక సంవత్సరంలో ఉక్కు కర్మాగార విస్తరణ యూనిట్లలో అసాధారణ పనితీరు నమోదు చేసిందని ప్లాంట్ యాజమాన్యం వెల్లడించింది. విశాఖ ఉక్కు కర్మాగారం విస్తరణ యూనిట్ల నుంచి మొత్తం 1,73,943 టన్నుల ఉత్పత్తి వచ్చింది. అందులో స్పెషల్ బార్ మిల్ నుంచి 5,43,942 టన్ను లు, వైర్ రాడ్ మిల్ నుంచి 6,15,188 టన్నులు, స్ట్రక్చరల్ మిల్ నుంచి 5,80,413 టన్నులు ఉత్పత్తి జరిగినట్లు యాజమాన్యం తెలిపింది. 47 లక్షల టన్నుల హాట్ మెటల్, 46 లక్షల టన్నుల లిక్విడ్ స్టీల్ ఉత్పత్తిని నమోదు చేసిందని, గత సంవత్స రం కంటే ఏడు శాతం వృద్ధిని హాట్ మెటల్ ఉత్పత్తిలో సాధించినట్లు తెలిపింది. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో 110 మిలియన్ టన్నుల ద్రవ ఉక్కును ఉత్పత్తి చేసినట్లు పేర్కొంది. కార్మికుల కృషి ఫలితంగానే ఈ అభివృద్ధి సాధించినట్లు స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్ భట్ తెలిపారు. కార్మికులను అభినందించారు.

నేడు రోటరీ హ్యూమన్ మిల్క్ బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి

తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో రోటర్ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ హ్యూమన్ మిల్క్ బ్యాంకును బుధవారం ఏర్పాటు చేయనున్నారు. రాయలసీమ ప్రాంతంలోనే అత్యాధునిక వైద్యసేవలతో విరాజిల్లుతున్న తిరుపతి ప్రసూతి ఆస్పత్రి, పురిటి బిడ్డల వైద్యకేంద్రంలో ముర్రుపాల ఆవశ్యకతను గుర్తించిన రోటరీ క్లబ్ సంస్థ రూ.30 లక్షల వ్యయంతో హ్యూమన్ మిల్క్ బ్యాంకును ఏర్పాటు చేసింది. దీన్ని బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసింది. తిరుపతి ప్రసూతి ఆస్పత్రిలోని పిల్లలకు పెద్దఎత్తున ముర్రుపాలు అవసరం ఉందని, ఈ మిల్క్ బ్యాంకు ఏర్పాటుతో దాదాపు 300 మంది పిల్లలకు అవసరమైన పాలను ఏర్పాటు చేయడానికి వీలుపడుతుందని ప్రభుత్వ మెటర్నటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.పార్థసారథి తెలిపారు. ఆస్పత్రిలో ప్రసవిస్తున్న తల్లులకు ముర్రుపాలపై అవగాహన కల్పించి, వారి నుంచి అవసరమైన పాలను సేకరించి, నిల్వ చేసేందుకు వీలుగా చర్యలు ప్రారంభించామని తెలిపారు.

కొత్త ఆర్థిక సంవత్సరం వల్ల ఆలస్యం

- పెన్షన్ల పంపిణీపై వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగిసి ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలైనందున రెండు రోజులు ఆలస్యంగా పెన్షన్ల పంపిణీ చేపట్టామని వైసిపి తెలిపింది. ప్రతియేటా ఏప్రిల్ నెలలో రెండు రోజులు ఆలస్యంగానే పెన్షన్ల పంపిణీ అయినట్లుగానే ఈ ఏడాదీ అయ్యిందని, ఈ అంశంపై చంద్రబాబు దుష్ప్రచారం చేయడం తగదని పేర్కొంది. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు, వైసిపి అధికార ప్రతినిధి నారాయణమూర్తి మంగళవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తన కుట్ర రాజకీయాలను మరోసారి బయటపెట్టుకున్నారని అన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కావున బ్యాంకుల కార్యకలాపాలు ఏప్రిల్ 1, 2 తేదీల్లో పూర్తి స్థాయిలో పనిచేయవని అన్నారు. ప్రభుత్వం తరఫున మంత్రి ముత్యాల నాయుడు ఈ నెల 3 నుంచి పెన్షన్లు ఇస్తారని ప్రకటన కూడా చేశారని తెలిపారు.

చంద్రబాబు వాయిస్ మెసేజ్‌లపై ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ జరగకుండా భగ్నం చేయడంతోపాటు వాయిస్ మెసేజ్‌ల ద్వారా అవాస్తవాలను రాష్ట్ర ప్రజలకు ప్రచారం చేస్తున్నారని టిడిపి అధినేత చంద్రబాబుపై వైసిపి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు మంగళవారం సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అనుమతులూ లేకుండా లక్షలాది మందికి వాయిస్ మెసేజ్‌లు పంపుతున్నారని అన్నారు. తక్షణమే టిడిపి తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవాలని సిఇఒను మల్లాది విష్ణు కోరారు.

'మిమ్స్' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. యాజమాన్యం తక్షణమే స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర కమిటీ తరపున రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిమ్స్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని 62 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా యజమాన్యం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఉద్యోగులపై పోలీసులు దాడి చేసి 90 మందిని అరెస్టు చేయడం తగదని అన్నారు.

పేదల భవిష్యత్తు తేల్చే ఎన్నికలివి

(మొదటిపేజీ తరువాయి)

మోసం చేయడానికి వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అప్పట్లో ఆ కూటమి ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదని తెలిపారు. రైతులకు రుణాలు, డ్వాక్రా రుణమాఫీ, మహలక్ష్మి, ఇంటింటికీ ఉద్యోగం, మూడు సెంట్ల ఇళ్ల స్థలం, పది వేల కోట్ల రూపాయలతో బిసి సబ్ ప్లాన్, రాష్ట్రంలోని నగరాలను సింగపూర్ చేస్తామనే ప్రధాన హామీలు ఉన్నాయని, ఏ ఒక్కటైనా అమలు చేశారా? అని అడుగుతున్నానని అన్నారు. ఈ నేపథ్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రంగురంగుల కలర్లతో, కరపత్రాలతో, సూపర్ సిక్స్ పేరుతో మోసగించడానికి మళ్లీ ముందుకు వచ్చారని విమర్శించారు. ఇలాంటి కూటమికి బుద్ధి చెప్పాలా? వద్దా? అని ప్రశ్నించారు. మైనార్టీల నాలుగు శాతం రిజర్వేషన్‌తో చెలగాటం ఆడుతున్నాడని విమర్శించారు. మీ బిడ్డ మీ కోసం 130 సార్లు బటన్ నొక్కాడని, మీరు రెండు బటన్లు నొక్కాలని విజ్ఞప్తి చేశారు. మరోసారి భారీ మెజార్టీ ఇస్తే మళ్లీ వలంటీర్లు మీ ముంగిటకు వచ్చి సంక్షేమాన్ని అందిస్తారని వివరించారు. ఈ ఎన్నికల్లో మోసాన్ని, అబద్ధాన్ని మట్టి కరిపించాలని కోరారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన మిథున్‌రెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ద్వారకనాథరెడ్డి, నిస్సార్ అహ్మద్‌లను పరిచయం చేశారు.

ఎమ్మెల్యే సుధాకర్‌బాబుకు మాతృ వియోగం

ప్రజాశక్తి నాదెండ్ల (పల్నాడు జిల్లా)

నివాళులర్పిస్తున్న మంత్రి రజిని తదితరులు

ప్రకాశం జిల్లా సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్ బాబు మాతృమూర్తి తలతోటి అన్నమ్మ (81) పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో వారి స్వగృహంలో మంగళవారం కన్నుమూశారు. అనారోగ్యంతో ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అన్నమ్మ గతంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, చిలకలూరిపేట నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, విడదల గోపి తూబాడు గ్రామంలోని సుధాకర్‌బాబు నివాసానికి వెళ్లి అన్నమ్మ భౌతికకాయానికి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుధాకర్‌బాబును ఓదార్చారు. బుధవారం తూబాడులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కెసిఆర్ అన్న కొడుకు అరెస్టు

- 14 రోజుల రిమాండ్
- భూ కబ్జా కేసులో ఎ1 నిందితుడు కన్నారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ కబ్జా కేసులో ఎ1 నిందితుడిగా ఉన్న మాజీ సిఎం కెసిఆర్ అన్న కొడుకు కల్వకుంట్ల కన్నారావును మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఇబ్రహీంపట్నం కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించింది. ఇందుకు సంబంధించి వివరాలను ఆదిభట్ల సిఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెగూడ గ్రామంలోని సర్వే నంబర్ 32లో రెండెకరాల పది గుంటల భూమిని కన్నారావు కబ్జా చేశారని గతంలో ఆదిభట్ల పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కన్నారావుతోపాటు మరో 30 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో ఈ కేసులో పలువురిని అరెస్టు చేశారు. అయితే ఇన్ని రోజులు కన్నారావు పరారీలో ఉన్నారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం కోర్టులో కన్నారావు పిటిషన్ వేయగా కోర్టు తిరస్కరించింది. మంగళవారం ఉదయం బాలాపూర్‌లోని ప్రముఖ అడ్వకేట్ వద్దకు కన్నారావు వచ్చారన్న పక్కా సమాచారంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం కోర్టులో హాజరు పరిచారు. 14 రోజుల రిమాండ్‌తో చర్లపల్లి జైలుకు కన్నారావును తరలించినట్లు సిఐ తెలిపారు.

రూ.11.45 లక్షల నగదు పట్టివేత

ప్రజాశక్తి-యంత్రాంగం

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో మంగళవారం భారీగా నగదు పట్టుబడింది. రూ.11.45 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పెద్దవడుగూరు మండలం మిడుతూరు వద్ద రూ.6.15 లక్షలు, రాయదుర్గం పట్టణం కణేకల్లు రోడ్డు వద్ద రూ.2.70 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించి ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో సీజ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కొత్తవూరు కూడలి వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వెంకటరావు ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టి రూ.2.50 లక్షల నగదును పట్టుకున్నారు. మందస మండలం స్రవంతి రెంటికోట నుంచి పలాసవైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: ఉగాదిని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఇఒ ఎవి.ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఆలయం వెలుపల మీడియాతో చైర్మన్ మాట్లాడుతూ.. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

భానుడు భగభగ

- 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అత్యంత వేడి సంవత్సరంగా 2024
- అప్రమత్తంగా వుండాలని ఐఎమ్‌డి హెచ్చరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

2024ను అత్యంత వేడి సంవత్సరంగా ఐఎమ్‌డి ప్రకటించినట్లుగానే రాష్ట్రంలో ఎండల తీవ్రత రికార్డుస్థాయిలోకి వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. చాలా ప్రాంతాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకూ సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఎక్కువగా వుంటాయని భారత వాతావరణశాఖ చెబుతోంది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నాడు చాలా ప్రాంతాల్లో ఈ ఏడాదికి అత్యధికంగా 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దేశంలోనే అత్యధికంగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు అప్రమత్తంగా వుండాలని అధికారులు సూచిస్తున్నారు.

నెల్లూరు జిల్లా కనిగిరి మండలంలో, కడప జిల్లాలోని చాపాడు మండలంలో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, నంద్యాల జిల్లా మహానంది మండలంలో 43.7, కర్నూలు జిల్లా గూడూరు మండలంలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల్లో 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే ప్రకాశం, పల్నాడు, కృష్ణా, విజయనగరం, పార్వతీపురం మన్యం, తిరుపతి, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, శ్రీసత్యసాయి జిల్లాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పటి వరకు రాష్ట్రంలో అత్యధికంగా 2016 మే 2న ప్రకాశం జిల్లాల్లోని వెలిగొండలో 48.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఇప్పటి వరకు రాష్ట్రంలో 2016 నుంచి నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

వ నెం	జిల్లా	మండలం	తేదీ	అత్యధిక ఉష్ణోగ్రత
1.	ప్రకాశం	వెలిగొండ	02.05.2016	48.6
2.	ప్రకాశం	టంగుటూరు	17.05.2017	47.8
3.	నెల్లూరు	మర్రిపాడు	31.05.2018	45.6
4.	కృష్ణా	ఇబ్రహీమ్‌పట్నం	26.05.2019	47.3
5.	కృష్ణా	పమిడిముక్కల	21.05.2020	
	గుంటూరు	భట్టిప్రోలు	21.05.2020	47.86
	ప్రకాశం	కనిగిరి	23.05.2020	
6.	ప.గోదావరి	పెదపాడు	31.03.2021	45.97
	తిరుపతి	గూడూరు	01.05.2022	45.98
	తూ.గోదావరి	రాజమండ్రి రూరల్	16.05.2023	46.8

రాష్ట్రానికి ముగ్గురు పరిశీలకులు

- 8 రాష్ట్రాలకు 17 మంది
- నియమించిన కేంద్ర ఎన్నికల సంఘం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రానికి ముగ్గురు పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. జనరల్ స్పెషల్ పరిశీలకులుగా మాజీ ఐఎఎస్ అధికారి రామ్మోహన్ మిశ్రా, పోలీస్ స్పెషల్ పరిశీలకులుగా మాజీ ఐపిఎస్ అధికారి దీపక్ మిశ్రా, ప్రత్యేక వ్యయ పరిశీలకులుగా మాజీ ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్‌ను ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు మంగళవారం నాడు కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. మొత్తం ఎనిమిది రాష్ట్రాలకు 17 మందిని పరిశీలకులుగా నియమించింది. ఎన్నికల వేళ పలు కీలక రాష్ట్రాల్లో నిఘా పెంచడంతోపాటు పరిపాలన, భద్రత, అభ్యర్థుల వ్యయాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక ఎన్నికల పరిశీలకులను నియమిస్తున్నట్లు వెల్లడించింది. అందుకోసం మాజీ అఖిల భారత సర్వీస్ అధికారులతోపాటు మంచి ట్రాక్ రికార్డు ఉన్న ఉన్నతాధికారుల సేవలను వినియోగించుకుంటున్నట్లు తెలిపింది. ఈ ప్రత్యేక ఎన్నికల పరిశీలకులు ధన ప్రభావం, కండ బలం, తప్పుడు సమాచారం తదితర అంశాలపై దృష్టి సారిస్తారని ఇసి తెలిపింది. ఏడు కోట్లకుపైగా జనాభా కలిగిన రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రతోపాటు బీహార్‌కు పరిశీలకులను పంపుతున్నట్లు పేర్కొంది. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఆంధ్రప్రదేశ్, ఒడిశాకు సైతం వీరిని పంపుతున్నామని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఒడిశాలో అభ్యర్థుల ఎన్నికల సంబంధిత ఖర్చులపై నిఘా కోసం ప్రత్యేక వ్యయ పరిశీలకులను నియమిస్తున్నట్లు తెలిపింది. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను అతిక్రమించొద్దని సూచించింది. మరోవైపు సి విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి మార్చి 29 వరకు 79 వేల ఫిర్యాదులు అందాయని చెప్పింది. మార్చి 16 నుంచి ఈ ఫిర్యాదులు అందాయని పేర్కొంది.

అందుకే కడప నుంచి పోటీ

- చిన్నాన్నను చంపిన వ్యక్తికి జగనన్న అండ
- రాష్ట్రంలో రాక్షస పాలన : షర్మిల

ప్రజాశక్తి- వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హత్యా రాజకీయాలకే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగానే చిన్నాన్న వివేకానందరెడ్డిని హత్య చేసిన అవినాష్‌రెడ్డికి ఎంపీ సీటు ఇచ్చారని పిసిసి అధ్యక్షులు షర్మిల తీవ్రంగా విమర్శించారు. వైఎస్ఆర్ జిల్లా వేంపల్లె మండలం ఇడుపులపాయలోని వ్యవసాయ క్షేత్రంలో వైఎస్ఆర్ సమాధి వద్ద తన తల్లి విజయమ్మ, కుమార్తె అంజలితో కలిసి మంగళవారం ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేసి నివాళులర్పించారు. అనంతరం షర్మిల విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఐదు పార్లమెంట్, 114 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిందని చెప్పారు. కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ బిడ్డగా తాను నిలబడుతున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం నాకు సులువైంది కాదని, నా కుటుంబాన్ని చీలుస్తుందని, వైఎస్ఆర్ అభిమానులను గందరగోళంలో పడేలా చేస్తుందని కూడా తెలుసని అన్నారు. తప్పనిసరి పరిస్థితిలో తీసుకున్న నిర్ణయమని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి నా అన్న అని, నా రక్తమని, ఆయనంటే నాకు ద్వేషం లేదని తెలిపారు. గత ఎన్నికల సమయంలో నన్ను చెల్లి కాదు బిడ్డ అని ఆయన అన్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి అయ్యాకే మారిపోయారని వివరించారు. ముఖ్యమంత్రిగా ఉన్న ఈ జగన్‌మోహన్‌రెడ్డి నాకు పరిచయం లేదని, ఆయన నా అనుకున్న వాళ్లనందరినీ నాశనం చేశాడని విమర్శించారు. వివేకానందరెడ్డిని హత్య చేసిన వాళ్లకే మళ్లీ కడప ఎంపీ సీటు ఇవ్వడాన్ని తట్టుకోలేకపోయానని చెప్పారు. హత్య చేసిన వాళ్లు, చేయించిన వాళ్లు తప్పించుకొని తిరుగుతున్నారని తెలిపారు. అన్ని సాక్ష్యాలు ఉన్నా చర్యలు లేవని, అధికారం వాడుకొని హంతకులను జగన్ రక్షిస్తున్నారని, అవినాష్‌రెడ్డిని వెనకేసుకొస్తున్నాడని విమర్శించారు. వివేకా హత్యను రాజకీయం కోసం వాడుకున్నారని మాకు చాలా ఆలస్యంగా అర్థమైందన్నారు. చిన్నాన్న వివేకా హత్య జరిగినప్పుడు సాక్షి ఛానల్ తప్పుడు కథనాలు ప్రసారం చేసిందని విమర్శించారు. హత్య చేసిన వాళ్లకు సీటిస్తే ప్రజలు హర్షించరని తెలిసి మళ్లీ అవినాష్‌రెడ్డికే సిఎం జగన్ టికెట్ ఇచ్చారన్నారు. వైఎస్ఆర్, వివేకా... రామలక్ష్మణుడిలా ఉండేవాళ్లని చెప్పారు. నన్ను ఎంపీగా చూడాలనేది వివేకా ఆఖరి కోరికని తెలిపారు. నా చెల్లి సునీత న్యాయం కోసం గడప గడపకూ తిరుగుతోందని, అయినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న రాజ్యం అని చెప్పి జగన్ రాక్షస రాజ్యం తెచ్చారని, ఒక్క ఛాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. విలేకరుల సమావేశంలో పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి, పిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, ఎమ్మెల్యే ఆర్థర్, జెడి శీలం, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై సర్కారు కుట్ర

ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామాజిక పింఛన్ల పంపిణీపై జగన్ సర్కారు కుట్ర చేస్తోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజలకు మంగళవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఉద్దేశంతోనే బహిరంగ లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వలంటీర్లతో నగదు పంపిణీ చేసే బాధ్యతల నుంచి ఎన్నికల కమిషన్ వారిని తప్పించి, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇళ్ల వద్దకే పింఛన్లు అందించాలని చెప్పిందని అన్నారు. దీనిని వైసిపి కుట్రలు, కుతంత్రాలకు ఉపయోగించుకుంటున్న దని, రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. గతేడాది, 2022 ఏప్రిల్ ఒకటో తేదీకి ముందే పింఛన్ల డబ్బు బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసి పంపిణీ చేశారని, ఈ ఏడాది కూడా ముందే బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసి ఉంటే ఇలాంటి పరిస్థితి ఎదురయ్యేది కాదని తెలిపారు. నిధుల కొరత వల్లే పింఛన్ల పంపిణీలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.

ఇంటి వద్దకే పింఛన్లు అమలుకు చర్యలు తీసుకోండి

సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మంగళవారం లేఖ రాశారు. పెన్షన్లు ఇంటింటికీ పంపిణీ చేయకుండా సెర్ప్ సిఇఒ మురళీధర్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ఎండల్లో పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు కిలోమీటర్ల దూరం వెళ్లలేరని, ఇంటి వద్ద పింఛను అందించే ఏర్పాటు చేయాలని లేఖలో ఇసికి విజ్ఞప్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల వద్దనే పింఛన్లు పంపిణీ చేసేలా సెర్ప్ సిఇఒ మురళీధర్‌రెడ్డి.. లబ్ధిదారులను ఇబ్బందిపెట్టే ఆదేశాలివ్వడం వెనుక కుట్ర దాగి ఉందని పేర్కొన్నారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి సెర్ప్ సిఇఒ మురళీధర్‌రెడ్డి బంధువని, గతంలో సిఎం జగన్.. సిబిఐ కేసుల్లో ఇతను కూడా సహ నిందితుడుగా ఉన్నారని అన్నారు. ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా దృష్టికి చంద్రబాబు ఫోన్ ద్వారా తెలియజేశారు.

దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్న

బిజెపిని, దాని మిత్రపక్షాలను ఓడించండి

- విశాఖలో కార్మిక, ప్రజా సంఘాల నాయకుల పిలుపు
- ఉక్కు జెఎసి దీక్షా శిబిరానికి మూడేళ్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్న బిజెపికి, దానికి సహకరిస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి నాయకులు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన దీక్షలు మంగళవారంతో మూడేళ్లకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద భారీ నిరసన దీక్ష చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి, జెఎసి చైర్మన్ ఎం. రాజశేఖర్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించనున్నట్టు కేంద్రంలోని మోడీ సర్కారు ప్రకటించినప్పటి నుంచీ విశాఖలో ఆందోళనలు కొనసాగుతున్నాయన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరానికి కార్మిక వర్గం, మేధావులు, కవులు, కళాకారులు, విద్యార్థి, యువజన, మహిళా, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివస్తూ మూడేళ్లుగా పోరాటాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడాన్ని అభినందించారు. అనేక రూపాల్లో జెఎసి నిర్వహించిన ఉద్యమాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా విశాఖ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం నిలబడే పార్టీలను గెలిపించుకోవాలని కోరారు. లక్షల కోట్ల రూపాయలను బ్యాంకులకు ఎగ్గొట్టిన దొంగలు రాష్ట్రంలో పోటీచేస్తున్నారని, వారిని చిత్తుగా ఓడించి ప్రజాస్వామ్యాన్ని, ప్రభుత్వ రంగాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలు కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారంటూ టిడిపి ఫిర్యాదు

పజాశక్తి - అమరావతి బ్యూరో

పెగాసెస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాపింగ్ చేసి డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎడిజి (ఇంటెలిజెన్స్) సీతారామాంజనేయులు వింటున్నట్లు టిడిపి ఫిర్యాదు చేసింది. ఇందుకు తగిన సమాచారం తమ వద్ద ఉందని సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాకు టిడిపి ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య మంగళవారం ఫిర్యాదు చేశారు.

డాక్యుమెంట్లు చూపేందుకు సమయం ఇవ్వాలి

పోలీసుల తనిఖీల్లో వ్యాపారుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించి డాక్యుమెంట్లను చూపించడానికి కనీసం 24 గంటల వ్యవధిని వ్యాపారులకు ఇవ్వాలని సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాకు టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండీ రాకేష్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. స్వాధీనం చేసుకున్న నగదును వెంటనే కోర్టుకు అటాచ్ చేస్తుండటంతో వ్యాపారులు ఆ డబ్బును తిరిగి పొందడం కష్టమవుతోందని పేర్కొన్నారు.

సిఎం జగన్‌పై బిజెపి ఫిర్యాదు

ఎన్నికల సభల్లో నిబంధనలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి అబద్ధాలను వల్లె వేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజీ పేర్కొన్నారు. ఈ మేరకు సచివాలయంలోని సిఇఒను కలిసి ఫిర్యాదు చేశారు.

ఫామ్-26 తెలుగులో ఉండాలని పిల్

ప్రజాశక్తి-అమరావతి

ఎన్నికల్లో అభ్యర్థులు దాఖలు చేసే అఫిడవిట్ తెలుగులో ఉండాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. అభ్యర్థుల ఆస్తులు, కేసులకు చెందిన అఫిడవిట్ (ఫామ్–26)ను తెలుగులో కూడా ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులివ్వాలని కోరుతూ కృష్ణా జిల్లా మాచవరానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు, తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు సామల రమేష్ బాబు పిల్ దాఖలు చేశారు. ఇప్పటికే తమిళనాడులో తమిళంలో ఫారం ఉంటుందన్నారు. ఇసికి వినతిపత్రం ఇస్తే ఫలితం లేదన్నారు. హైకోర్టు ఇవ్వబోయే తీర్పునకు అనుగుణంగా అభ్యర్థులు తమ ఆస్తులు, కేసుల వివరాలు తెలుగులో ఉండేలా చేయాలన్నారు. ఫామ్–26 ఇంగ్లీష్‌లో ఉంటోందన్నారు. దీనివల్ల అభ్యర్థుల వివరాలు ప్రజలకు తెలియడం లేదన్నారు.

వలంటీర్ల ద్వారా పింఛన్లు చెల్లించాలని పిల్

పెన్షన్లను వలంటీర్లు చేయరాదని కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. గత నెల 30న ఇసి జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా కుంచనపల్లి, మున్నంగికి చెందిన వంగా వరలక్ష్మి, వంగా బిందు, అల్లు సునీత పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై బుధవారం విచారణ జరుపుతామని హైకోర్టు ప్రకటించింది.

వివేకా కుమార్తెకు ఊరట

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సిబిఐ అధికారి రామ్‌సింగ్‌పై వివేకా పిఎ కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పులివెందులలో నమోదైన కేసు విచారణను హైకోర్టు నిలిపేసింది. దర్యాప్తుపై తదుపరి చర్యలన్నింటినీ 4 వారాలపాటు తాత్కాలికంగా నిలిపేసింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. వివేకా హత్య కేసులో తాము చెప్పినట్లు చేయకపోతే అంతు చూస్తామంటూ వేధిస్తున్నారని కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పులివెందుల పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. పులివెందుల కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. దీనిని ఆ ముగ్గురు హైకోర్టులో సవాల్ చేశారు. పులివెందుల కోర్టులో జరుగుతున్న విచారణకు సంబంధించి తదుపరి చర్యలను నాలుగు వారాల పాటు నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయి.

వేటకు వెళ్లిన ఆరుగురు మత్స్యకారులు గల్లంతు

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం)

విజయనగరం జిల్లా భోగాపురం మండం ముక్కాం గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు విశాఖ తీరంలో వేటకు వెళ్లి గల్లంతయ్యారు. సోమవారం మధ్యాహ్నం వేటకు వెళ్లిన వీరంతా తిరిగి రాకపోవడంతోపాటు ఫోన్లు కూడా పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. నేవీ సిబ్బంది, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ముక్కాం గ్రామానికి చెందిన కారి గరగయ్యకు విశాఖ జెట్టీలో వేటకు వెళ్లేందుకు బోటు ఉంది. అందులో సోమవారం మధ్యాహ్నం ఎప్పటి మాదిరిగానే గరగయ్యతో పాటు ఆయన కుమారుడు చిన్నారావు, కారి నరేంద్ర, వాసుపల్లి అప్పన్న, పొడుగు అప్పన్న, మైలపల్లి మహేష్ కూడా వెళ్లారు. వేటకు వెళ్లిన వీరంతా తిరిగి ఒడ్డుకు చేరకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గాలుల తీవ్రతకు సముద్రంలో బోటు బోల్తా పడినట్లు భావిస్తున్నారు. ప్రస్తుతం బోటు విశాఖ తీరంలో ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. నేవీ అధికారులు హెలికాప్టర్, నౌకల సాయంతో మత్స్యకారుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మత్స్యకారుల గల్లంతుతో ముక్కాం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఎన్నికల ఉల్లంఘన

- ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డిపై తుళ్లూరులో కేసు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా మాట్లాడటంపై ప్రభుత్వ సలహాదారుడు, ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డిపై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది. చంద్రశేఖర్‌రెడ్డిపై ఆంధ్రా పింఛనర్ల పార్టీ అధ్యక్షుడు సుబ్బరాయన్ తుళ్లూరు ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. సచివాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి రాజకీయ వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తుళ్లూరు ఎంపిడిఒ శివనారాయణ విచారణ చేపట్టి చంద్రశేఖర్‌రెడ్డి కోడ్ ఉల్లంఘించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థకు ఐఎస్ఒ సర్టిఫికెట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకుగానూ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి)కి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఒ) సర్టిఫికెట్ వరించింది. హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మంగళవారం తాడేపల్లిలోని ఎస్ఎస్‌డిసి కార్యాలయంలో నైపుణ్యాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్, ఎమ్‌డి వినోద్ కుమార్‌కు ఐఎస్ఒ 2001-2015 సర్టిఫికెట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థకు ఐఎస్ఒ సర్టిఫికెట్ రావటం చాలా ఆనందంగా ఉందని, ఈ సర్టిఫికెట్ ద్వారా ఎపిఎస్ఎస్‌డిసి మరో మైలురాయిని అధిగమించిందని చెప్పారు.

పింఛన్ల పంపిణీని అడ్డుకున్న చంద్రబాబు : మంత్రి మేరుగ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతినెలా ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందించే ప్రక్రియను అడ్డుకుని చంద్రబాబు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు అందకుండా చేసి, చంద్రబాబు ఇపుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. తన బంధువైన నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌తో పిటిషన్లు పెట్టించి పింఛన్ల పంపిణీని ఆపేశారని పేర్కొన్నారు. శింగనమల నియోజకవర్గంలో ఒక టిప్పర్ డ్రైవరుకు టికెట్ ఇస్తే తట్టుకోలేక అవహేళన చేస్తున్నారని అన్నారు.

మిమ్స్ ఉద్యోగుల ఆందోళన తీవ్రతరం

- ర్యాలీ, రహదారిపై బైఠాయింపు
- 150 మంది అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-విజయనగరం కోట

నాయకులను, మిమ్స్ ఉద్యోగులను అరెస్టు చేస్తున్న పోలీసులు

గత 62 రోజులుగా సమ్మె చేస్తూ వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నా యాజమాన్యంగానీ, అధికారులుగానీ స్పందించకపోవడంపై మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన తీవ్రతరం చేశారు. మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం విజయనగరం జిల్లా తోటపాలెంలోని ఎల్‌బిజి భవనం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ రహదారిపై బైఠాయించారు. దీంతో వందలాదిగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు మిమ్స్ ఉద్యోగులను, నాయకులను బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో మిమ్స్ ఉద్యోగి దుప్పాడ ధనలక్ష్మి సొమ్మసిల్లి కింద పడిపోయారు. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు 150 మందిని అదుపులోకి తీసుకోగా, 75 మందిపై కేసులు నమోదు చేసి వ్యక్తిగత పూచీకతులపై విడిచిపెట్టారు.

ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టివి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వేతన ఒప్పందం అమలు చేయాలని, సస్పెన్షన్‌లు, వేధింపులు ఆపాలని, ప్రభుత్వం ప్రకటించిన డిఎ అమలు చేయాలని, అన్యాయంగా తొలగించిన ఇద్దరు ఉద్యోగులను వెంటనే విధులోకి తీసుకోవాలని, అగ్రిమెంట్‌ను అమలు చేయాలని కోరుతూ పోరాడుతుంటే యాజమాన్యం చట్టాలను ధిక్కరించి మొండిగా వ్యవహరిస్తోందన్నారు. మిమ్స్‌లో ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందడంలేదని తెలిపారు. చివరికి వైద్య విద్యార్థులకు చదువు కూడా అగిపోయిందన్నారు. అయినా అధికారులకు గానీ, ప్రజా ప్రతినిధులకు గానీ చీమకుట్టినట్టైనా లేదని తెలిపారు. యాజమాన్యం స్పందించి చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులు, కేసులతో ఉద్యమాన్ని ఆపలేరని, సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సుధారాణి, ఉద్యోగులు కె.కామునాయుడు, ఎం.రాంబాబు, కె.మధు, బంగారు నాయుడు, నాగభూషణం, మూర్తి, అప్పలనాయుడు, గౌరీ, స్వర్ణ, భవాని, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎసిబి వలలో ఎస్ఐ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-టంగుటూరు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన ఎస్ఐ ఎ నాగేశ్వరరావు రూ.70 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డారు. ఎసిబి అధికారుల కథనం ప్రకారం.. కాకుటూరువారిపాలెం గ్రామానికి చెందిన కొమ్మినేని శ్రీనివాసరావు గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా బ్యారన్ నిర్మిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. బ్యారన్ నిర్మిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటే రూ.లక్ష ఇవ్వాలని కొమ్మినేని శ్రీనివాసరావును ఎస్ఐ డిమాండ్ చేశారు. రూ.70 వేలు లంచం సొమ్మును మంగళవారం టంగుటూరులోని ఎస్ఐ నివాసం ఉంటున్న చెల్లెమ్మ తోట వద్ద ఎస్ఐకు శ్రీనివాసరావు ఇస్తుండగా అక్కడే మాటు వేసిన ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్ఐపై కేసు నమోదు చేశారు.

నంద్యాల టిడిపి పార్లమెంట్ ఇన్‌ఛార్జి భార్య, కుమారుడికి ముందస్తు బెయిల్

కర్నూలు ప్రతినిధి: భూ వివాదం కేసులో నంద్యాల పార్లమెంట్ తెలుగుదేశం ఇన్‌ఛార్జి మాండ్ర శివానందరెడ్డి భార్య, కుమారుడికి మంగళవారం ముందస్తు బెయిల్ లభించింది. శివానందరెడ్డి భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్క్‌రెడ్డిని హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి నాంపల్లి కోర్టుకు తరలించేందుకు సిద్ధమవ్వగా దీనిపై శివానందరెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారిని రెండు రోజుల వరకూ అరెస్టు చేయకూడదని, ఇప్పటికే అరెస్టు చేసినట్లయితే సొంత పూచీకత్తుపై విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించడంతో మంగళవారం వారికి ముందస్తు బెయిల్ మంజూరైంది.

పాలిటెక్నిక్‌తో ఉన్నత స్థితికి

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

పాలిటెక్నిక్ కోర్సు ద్వారా ఉన్నత స్థితికి చేరొచ్చని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జడ్‌పి పాఠశాలలో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, జెవివి ఆధ్వర్యాన పాలీసెట్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు ఐఐఐటి తర్వాత ఎపిఆర్‌జెసి, పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా తక్కువ ఖర్చుతో డిగ్రీ పొందొచ్చని తెలిపారు. ఎంతో డిమాండ్ ఉన్న పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలే కాకుండా సామాజిక బాధ్యతతోనూ యుటిఎఫ్ వ్యవహరిస్తోందని, పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లనూ అందించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తరగతుల కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

SBFC | ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్ (పూర్వం ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్)
నమోదిత కార్యాలయం : యూనిట్ నం.103, ఒకటవ అంతస్తు, సి అండ్ బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, చకల గ్రామం, అంధేరి-కుర్లా రోడ్డు, అంధేరి (తూర్పు) ముంబై-400059.

డిమాండ్ నోటీసు

ఇక్కడ పేర్కొన్న రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు **ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్** నుండి ఆర్థిక సహాయాన్ని పొందారు. ఆర్థిక సహాయం పొందినప్పటికీ రుణగ్రహీతలు/ తనఖాదారులు గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయినారని తెలియజేస్తున్నాము. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గ దర్శకాల ప్రకారం, **ఎస్‌బిఎఫ్‌సి** పుస్తకాలలో, ఇక్కడ పేర్కొన్న తేదీలలో ఖాతా నాన్ పెర్ఫార్మింగ్ అసెట్‌గా వర్గీకరించబడింది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (**SARFAESI** చట్టం) మరియు సెక్షన్ 13 (12) కింద **ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారికి అందించబడిన అధికారాల వినియోగంలో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో పాటు డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. కింద రుణగ్రహీతలు/తనఖాదారులు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని కింద పేర్కొన్న సంబంధిత తేదీల నుండి 60రోజులలోపు, నోటీసులో పేర్కొన్న మొత్తానికి ఒప్పంద రేటుకు మరియు యాదృచ్ఛిక ఖర్చులు, ఛార్జీలు మొదలైనవాటితో సహా తిరిగి చెల్లించవలసి ఉంటుంది. వారి చివరిగా తెలిసిన చిరునామాలపై వారికి జారీ చేయబడిన నోటీసులు అందించబడని విధంగా తిరిగి వచ్చాయి మరియు దీని గురించి పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయడం జరిగింది.

రుణగ్రహీతల పేరు/చిరునామా/ నోటీసు తేది మరియు ఎన్‌పిఎ	లోన్ నం. మరియు బకాయి మొత్తం	సెక్యూర్డ్ అసెట్ వివరణ
1. రవి వులి, 2. దేవి వులి, డో.నం.25-27-31, లక్ష్మీ నగర్, మెయిన్ రోడ్డు, తిరుపతమ్మ గుడి వద్ద, సాయి నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522004. **నోటీసు తేది : 15 ఫిబ్రవరి 2024 ఎన్‌పిఎ తేది : 6 అగస్ట్ 2021**	**లోన్ ఎకౌంట్ నెం. 519997 (PR00434660) లోన్ మొత్తం : రూ. 6,50,000/- లోన్ ఎకౌంట్ నెం. 549996 (PR00461332) లోన్ మొత్తం : రూ. 8,50,000/- లోన్ ఎకౌంట్ నెం. RME519997 (PR00852089) లోన్ మొత్తం : రూ. 74,530/- బకాయి మొత్తం : రూ. 29,05,425/-** (ఇరవై తొమ్మిది లక్షల ఐదు వేల నాలుగు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే) 12 ఫిబ్రవరి, 2024 నాటికి.	గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, నల్లపాడు, నల్లపాడు సబ్ డివిజన్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, అంకిరెడ్డిపాలెం గ్రామం యొక్క ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ విస్తీర్ణం 78.0 చ.గ.లు. లేదా 65.21 చ.మీ.లు. తో పాటు డో.నం.160/ఎ1 లో ఆర్‌సిసి భవనంతో రెసిడెన్షియల్ స్థలం మరియు ఆస్తి క్రింది విధమైన హద్దులు (డాక్యుమెంట్ నం.1641/2011 ప్రకారం) : తూర్పు : 20 అ.లు. వెడల్పు రోడ్డు, పడమర : అడప కోటేశ్వరరావుకు సంబంధించిన ఆస్తి, ఉత్తరం : ఏపూరి కవితకు సంబంధించిన ఆస్తి, దక్షిణం : తోట కుమారికి సంబంధించిన ఆస్తి.

పైన పేర్కొన్న పరిస్థితులలో, పైన పేర్కొన్న రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలకు ఈ నోటీసు ఇచ్చిన తేదీ నుండి 60 రోజులలోపు ఫ్యూచర్ ఇంట్రస్ట్ మరియు వర్తింపు కేబుల్ ఛార్జీలతో పాటు పైన పేర్కొన్న బకాయిలను చెల్లించాలని నోటీసు ఇవ్వబడింది. **SARFAESI** చట్టంలోని సెక్షన్ 13(4) మరియు దాని కింద వర్తించే నిబంధనల ప్రకారం రుణగ్రహీతలు మరియు తనఖా పెట్టేవారి సురక్షిత ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో సహా సెక్యూర్డ్ అసెట్‌లకు వ్యతిరేకంగా ఈ నోటీసు తేదీ 60 రోజుల గడువు ముగిసిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోబడతాయి. దయచేసి **SARFAESI** చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, ఏ రుణగ్రహీత, సురక్షితమైన రుణదాత యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, నోటీసులో సూచించిన అతని సురక్షిత ఆస్తులను అమ్మకం, లీజు లేదా ఇతర మార్గాల ద్వారా బదిలీ చేయకూడదు.

తేది: 3 ఏప్రిల్, 2024, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్.

కాంగ్రెస్ అభ్యర్థులు వీరే

5 పార్లమెంటు స్థానాలకు

1 కడప - వైఎస్ షర్మిల
2. రాజమండ్రి - గిడుగు రుద్రరాజు
3. బాపట్ల (ఎస్‌సి) - జెడి శీలం
4. కర్నూలు -పిజి రామ్‌పుల్లయ్య యాదవ్
5. కాకినాడ -ఎంఎం పల్లం రాజు

114 అసెంబ్లీ స్థానాలకు

అసెంబ్లీ స్థానం	అభ్యర్థి
1. ఇచ్ఛాపురం	-మసుపత్రి చక్రవర్తి రెడ్డి
2. పలాస	- మజ్జి త్రినాథ్ బాబు
3. పాతపట్నం	-కొప్పురోతు వెంకటరావు
4. శ్రీకాకుళం	- పైడి నాగభూషణ్‌రావు
5. ఆమదాలవలస	-సన్నపాల అన్నాజీరావు
6. ఎచ్చెర్ల	-కరిమజ్జి మల్లేశ్వరరావు
7. నరసన్నపేట	- మంత్రి నర్సింహామూర్తి
8. రాజాం (ఎస్‌సి)	-కంభాల రాజవర్ధన్
9. పాలకొండ (ఎస్‌టి)	-సరవ చంటిబాబు
10. పార్వతీపురం (ఎస్‌సి	-బత్తిన మోహన్‌రావు
11. సాలూరు (ఎస్‌టి)	- మువ్వల పుష్పారావు
12. చీపురుపల్లి	- తుమ్మగంటి సూరినాడు
13. గజపతినగరం	-జి.కుర్మినాయుడు
14. విజయనగరం	-సుంకరి సతీష్ కుమార్
15. విశాఖ ఈస్ట్	- గుత్తుల శ్రీనివాసరావు
16. మాడుగుల	-బిబిఎస్ శ్రీనివాసరావు
17. పాడేరు (ఎస్‌టి)	- ఎస్ బుల్లిబాబు
18. అనకాపల్లి	- ఐలా రామ గంగాధరరావు
19. పెందుర్తి	- పి.భగత్
20. పాయకరావుపేట (ఎస్‌సి)	- బొని తాతారావు
21. తుని	- జి. శ్రీనివాసరావు
22. ప్రత్తిపాడు	- ఎన్‌వివి సత్యనారాయణ
23. పిఠాపురం	-మద్దేపల్లి సత్యానందరావు
24. కాకినాడ రూరల్	- పిల్లి సత్య లక్ష్మి
25. పెద్దాపురం	- తుమ్మల దొరబాబు
26. అనపర్తి	-వై.శ్రీనివాసరావు
27. కాకినాడ సిటీ	-చెక్కా నూకరాజు
28. రామచంద్రపురం	- కోట శ్రీనివాసరావు
29. ముమ్మిడివరం	-పాలేపు ధర్మారావు
30. అమలాపురం (ఎస్‌సి)	-ఎ.సుభాషిణి
31. రాజోలు (ఎస్‌సి)	-సర్రెళ్ల ప్రసన్నకుమార్
32. కొత్తపేట	- రౌతు ఈశ్వరరావు
33. మండపేట	-కె. ప్రభాకర్‌రావు
34. రాజానగరం	-ముండ్రు వెంకట శ్రీనివాస్
35. రాజమండ్రి సిటీ	- బి. లక్ష్మీ వెంకట ప్రసన్న
36. రాజమండ్రి రూరల్	- బల్లేపల్లి మురళీధర్
37. జగ్గంపేట	-ఎం.వి.వి. గణేశ్వరరావు
38. కొవ్వూరు (ఎస్‌సి)	-ఎ. అరుణ కుమారి
39. నిడదవోలు	- పి. సుబ్బారావు
40. పాలకొల్లు	-కె. అర్జునరావు
41. నర్సాపురం	-కానూరి ఉదయ భాస్కర్
42. భీమవరం	-అంకెం సీతారాము
43. ఉండి	-వి. వెంకట గోపాలకృష్ణ
44. తణుకు	-కడలి రామారావు
45. తాడేపల్లిగూడెం	-ఎం.శేఖర్
46. ఉంగుటూరు	-పి.హరికుమార్ రాజు
47. దెందులూరు	-ఆలపాటి నరసింహమూర్తి
48. పోలవరం (ఎస్‌టి)	-దేవెళ్ల సృజన
49. చింతలపూడి (ఎస్‌సి)	-ఉన్నమట్ల ఎలిజా
50. తిరువూరు (ఎస్‌సి)	-లాం తాంతియా కుమారి
51. నూజివీడు	-మరీదు కృష్ణ
52. గుడివాడ	-వడ్డాది గోవిందరావు
53. కైకలూరు	-బొడ్డు నోబుల్
54. పెడన	-శొంఠి నాగరాజు
55. మచిలీపట్నం	-అబ్దుల్ మతీన్
56. అవనిగడ్డ	- అందె శ్రీరామ్మూర్తి
57. పామర్రు (ఎస్‌సి)	-డివై దాస్
58. పెనమలూరు	- ఎలిసల సుబ్రమణ్యం
59. మైలవరం	-బొర్రా కిరణ్
60. నందిగామ (ఎస్‌సి)	-మందా వజ్రయ్య
61. పెదకూరపాడు	-పమిడి నాగేశ్వరరావు
62. తాడికొండ (ఎస్‌సి)	-చిలకా విజయ్ కుమార్
63. పొన్నూరు	-జక్కా రవీంద్రనాథ్
64. వేమూరు (ఎస్‌సి)	-బురగా సుబ్బారావు
65. ప్రత్తిపాడు (ఎస్‌సి)	-కె. వినయ్ కుమార్
66. గుంటూరు ఈస్ట్	-షేక్ మస్తాన్ వలి
67. చిలకలూరిపేట	-మద్దుల రాధాకృష్ణ
68. నరసారావుపేట	- షేక్ మహబూబ్ బాషా
69. వినుకొండ	-చెన్నా శ్రీనివాసరావు
70. గురజాల	-టి.యలమంద రెడ్డి
71. మాచర్ల	-వై. రామచంద్రారెడ్డి
72. దర్శి	-పి. కొండారెడ్డి
73. అద్దంకి	-అడుసుమిల్లి కిషోర్‌బాబు
74. ఒంగోలు	-బిఆర్ గౌస్
75. కందుకూరు	-సయ్యద్ గౌస్ మెయిద్దీన్
76. కొండపి (ఎస్‌సి)	-శ్రీపతి సతీష్
77. మార్కాపురం	-షేక్ సైదా
78. గిద్దలూరు	- పి. పెద్ద రంగస్వామి
79. కనిగిరి	-కదిరి భవాని
80. ఆత్మకూరు	-చెరువు శ్రీధర్ రెడ్డి
81. కొవ్వూరు	-ఎన్.మోహన్
82. నెల్లూరు రూరల్	- షేక్ ఫయాజ్
83. సర్వేపల్లి	- పూల చంద్రశేఖర్
84. గూడూరు (ఎస్‌సి)	- చిలకూరి వేమయ్య
85. సూళ్లూరుపేట (ఎస్‌సి)	-జి.తిలక్ బాబు
86. ఉదయగిరి	-సోము అనిల్ కుమార్ రెడ్డి
87. బద్వేల్ (ఎస్‌సి)	-ఎన్.దొర విజయ జ్యోతి
88. కోడూరు (ఎస్‌సి)	- గోశాల దేవి
89. రాయచోటి	-షేక్ అల్లా భక్షు
90. నందికోట్కూరు (ఎస్‌సి)	-టి. ఆర్థర్
91. నంద్యాల	- గోకుల కృష్ణారెడ్డి
92. కోడుమూరు (ఎస్‌సి)	-పి. మురళీకృష్ణ
93. రాయదుర్గం	-ఎంబి చిన్న అప్పయ్య
94. ఉరవకొండ	- వై.మధుసూదన్ రెడ్డి
95. గుంతకల్	-కావలి ప్రభాకర్
96. తాడిపత్రి	- జి. నాగిరెడ్డి
97. శింగనమల (ఎస్‌సి)	-సాకే శైలజానాథ్
98. రాప్తాడు	-ఎఎ శంకరయ్య
99. మడకశిర (ఎస్‌సి)	-కె.సుధాకర్
100. హిందూపూర్	-వి.నాగరాజు
101. పెనుకొండ	-పి.నర్సప్ప
102. పుట్టపర్తి	-మధుసూదన్ రెడ్డి
103. కదిరి	-కెఎస్ షహనవాజ్
104. తంబళపల్లె	-ఎం.ఎన్.చంద్రశేఖర్ రెడ్డి
105. పీలేరు	-బి.సోమశేఖర్ రెడ్డి
106. మదనపల్లె	-పవన్ కుమార్ రెడ్డి
107. పుంగనూరు	-జి.మురళీ మోహన్ రెడ్డి
108. చంద్రగిరి	-కె.శ్రీనివాసులు
109. శ్రీకాళహస్తి	-పోతుగుంట రాజేష్ నాయుడు
110. సత్యవేడు (ఎస్‌సి)	-బి.బాబు
111. నగరి	-పి.రాకేష్ రెడ్డి
112. చిత్తూరు	-జి.టి.రామ్
113. పలమనేరు	-బి.శివశంకర్
114. కుప్పం	-ఆవుల గోవిందరాజులు

ప్రజాశక్తి ఫిర్యాదుపై కొనసాగుతున్న సిఐడి విచారణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖలో మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్న సమయంలో ప్రజాశక్తి అమరావతి బ్యూరో పేరుతో తప్పుడు కథనాన్ని తయారు చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసిన విషయంపై సిఐడి విచారణ కొనసాగుతోంది. డిఎస్‌పి స్థాయి అధికారి దీని విచారణ బాధ్యతలు చూస్తున్నారు. గత నెల 22న వచ్చిన ఈ ఫేక్ కథనంపై సిఐడికి, సైబర్‌క్రైం అధికారులకు ప్రజాశక్తి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసిన వి సురేష్ నుంచి సిఐడి అధికారులు ఇప్పటికే స్టేట్‌మెంటు తీసుకున్నారు.

చైతన్య విద్యార్థిని ఆత్మహత్య కేసులో పలువురు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

లైంగిక వేధింపుల కారణంగా గత నెల 28న కొమ్మాది చైతన్య కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న 17 ఏళ్ల డిప్లొమో విద్యార్థిని ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితునితోపాటు కళాశాలకు చెందిన నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను విశాఖ డిసిపి 1 (లా అండ్ ఆర్డర్) మణికంఠ మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... తన కూతురు కనిపించడంలేదని అనకాపల్లి జిల్లా నాతవరానికి చెందిన మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిఎం.పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిసి ఫుటేజీలను పరిశీలించారు. కెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ శంకరరావును ప్రధాన నిందితునిగా గుర్తించారు. అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు.

శంకరరావుతోపాటు హాస్టల్ నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన, నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్‌ను నిర్వహిస్తున్నందున హాస్టల్ మేనేజ్‌మెంట్ సభ్యులు శంకర్ వర్మ, డిప్లమో కాలేజీ ప్రిన్సిపల్ గుల్లిపల్లి భాను ప్రవీణ్, హాస్టల్ వార్డెన్ వంటపతి ఉషారాణి, వార్డెన్ భర్త వంటపతి ప్రదీప్ కుమార్‌లను అరెస్టు చేశారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (HINDUJA HOUSING FINANCE)
కార్పొరేట్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015, తమిళనాడు, ఇండియా
రీజినల్ ఆఫీసు: హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 2వ అంతస్తు, టి19 టవర్స్, కర్బలా మైదాన్, రాణిగంజ్, సికింద్రాబాద్, హైదరాబాద్-తెలంగాణ-500003. www.hindujahousingfinanace.com

అనుబంధం-4-ఎ (రూల్ 8(6)కు నియమాలను చూడండి) ఇ-వేలం మరియు అమ్మకం కొరకు బహిరంగ ప్రకటన (అనుబంధం-4ఎ) (రూల్ 8(6))

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్) దీని కార్పొరేట్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్‌మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015 మరియు బ్రాంచి 3వ అంతస్తు, బిడిపి ప్లాజా, బ్యాంక్ రోడ్, న్యూ కాటన్ మార్కెట్, విద్యానగర్, కర్ణాటక, హుబ్లి-580029 వద్ద కలిగియుండి ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట "చట్టంగా" పిలువబడును) క్రింద తాకట్టుపెట్టబడిన స్థిరాస్తి అమ్మకం. ఏదైతే, హెచ్‌హెచ్‌ఎఫ్ యొక్క అధీకృత అధికారిగా బకాయి మొత్తాలను రాబట్టుట కొరకు "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలాగే" ప్రాతిపదికన వాటిని విక్రయించు అధికారాలతో దిగువ రుణ ఖాతాలు/ప్రాస్పెక్ట్ నెం.లలో చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద జారీచేయబడిన నోటీసు అనుసరించి సెక్షన్ 13(4) క్రింద దిగువ ఆస్తి/ని స్వాధీనంచేసుకున్నారు. అమ్మకం అనునది దిగువ సంతకందారుచే వెబ్‌సైట్: https://bankauctions.in/ వద్ద కల్పించిన ఇ-వేలం ప్లాట్‌ఫారం ద్వారా చేపట్టబడును.

రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు /హామీదారులు/లాన్ నెం.	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	బాకీపడిన మొత్తం	స్వాధీనతా తేది	రిజర్వుధర	ఆస్తి తనిఖీచేయు తేది
1) శ్రీ.దిల్షాద్ మహ్మద్ (రుణగ్రహీత) 2) శ్రీమతి పర్వీన్ అస్మా (సహ-రుణగ్రహీత), ఇ.నెం. 12-1-490/40/ఎ/3/2, మొదటి అంతస్తు, హుడా కాలనీ ఆసిఫ్ నగర్, హైదరాబాద్-500028 LAN: AP/HDB/LBNG/ A000000076	22.02.2023 రూ.40,58,158/- (రూపాయలు నలభైలక్షల యాభైఎనిమిదివేల ఒకవంద యాభైఎనిమిది మాత్రమే)	బాకీపడిన మొత్తం 16-02-2024. నాటికి Rs. 44,85,982 /-	లాంఛనప్రాయ స్వాధీనతా 27/06/2023; బిడ్ పెంపుదల మొత్తాలు రూ.10,000/-	Rs. 28,80,000 /-; ధరావత్తు (ఈఎండి): రూ.2,88,000/-	15-04-2024 & 22-04-2024 1100 hrs -1400 hrs; ధరావత్తుకు చివరి తేది: 06.05.2024న సా.500గం.లు; ఇ-వేలం తేది/సమయం: 07-05-2024 1100 hrs-1300 hrs.
స్థిరాస్తి/ సెక్యూర్డు అసెట్ యొక్క వివరణ: గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్ డిస్ట్రిక్ట్, గోరంట్ల గ్రామపంచాయతీ ఏరియా లిమిట్స్, 6వ బ్లాక్, గోరంట్ల గ్రామంలోని ఎక.10.06 సెంట్ల విస్తీర్ణపు డోర్ నెం.476, డి.నెం.477 విస్తీర్ణం 14.75 సెంట్లు, మొత్తంగా ఎక.24.81 సెంట్లు, 1.85 సెంట్ల విస్తీర్ణంలో, ప్లాట్ నెం.697లో 200 చ.గ.ల విస్తీర్ణంలో ఉన్న స్థలం: సరిహద్దులు: తూర్పు: 33అ.ల వెడల్పు రోడ్డు 33.4అ.లు, దక్షిణం: ప్లాట్ నెం.698 54.0అ.లు, పడమర: ప్లాట్ నెం.688 కోల ఇమానియేలకు చెందినది 33.4 అ.లు, ఉత్తరం: ప్లాట్ నెం.696 సూదుల హనుమంత రావుకు చెందినది 54.0 అ.లు. ఈ ఎగువ సరిహద్దులలో 200చ.గ.లు లేదా 167.23 చ.మీ.ల విస్తీర్ణపు ఖాళీ స్థలం మాత్రమే.					
1) సిద్ధార్థ్ రెడ్డి దండోలు (రుణగ్రహీత) 2) శ్రీ.రాధ దండోలు (సహ-రుణగ్రహీత) ప్లాట్ నెం.101, ఫేజ్-1, ఇంద్రప్రస్థ కాలనీ హస్తినాపురం సెంట్రల్ సరూర్‌నగర్ కె.వి. రంగారెడ్డి తెలంగాణ-500079. LAN: AP/HDB/LBNG/ A000000064	22.02.2023 Rs.42,65,544/- (రూపాయలు నలభైరెండు లక్షల అరవైఐదు వేల ఐదువందల నలభై నాలుగు మాత్రమే)	బాకీపడిన మొత్తం 16-16-2024. నాటికి Rs. 46,97,106 /-	లాంఛనప్రాయ స్వాధీనతా 27/06/2023; బిడ్ పెంపుదల మొత్తాలు రూ.10,000/-	Rs. 28,80,000 /-; ధరావత్తు (ఈఎండి): రూ.2,88,000/-	15-04-2024 & 22-04-2024 1100 hrs -1400 hrs; ధరావత్తుకు చివరి తేది: 06.05.2024న సా.500గం.లు; ఇ-వేలం తేది/సమయం: 07-05-2024 1100 hrs-1300 hrs.
స్థిరాస్తి/ సెక్యూర్డు అసెట్ యొక్క వివరణ: డి.నెం.476, గోరంట్ల, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిమితులు, గుంటూరు జిల్లా లోని 200చ.గ.ల విస్తీర్ణపు నెం.713గల ఖాళీ ప్లాట్ మొత్తం భాగం మరియు సరిహద్దులు: కొరిటెపాడుసబ్-జిల్లా సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం.720, దక్షిణం: ప్లాట్ నెం.712, పడమర: 33 అ.ల వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.714					
1) శ్రీ మస్తాన్ మొహమ్మద్, (రుణగ్రహీత) 2) శ్రీమతి ఉన్నిసా జెబా (సహ-రుణగ్రహీత) ఇ.నెం. 13-6-434/ఏ/168, సర్దార్ బాగ్, లంగర్ హౌస్, గోల్కొండ, హైదరాబాద్, తెలంగాణ-500008 LAN - AP/HDB/LBNG/ A000000103	23.01.2023 Rs.25,40,517/- (రూపాయలు ఇరవైఐదు లక్షల నలభైవేల ఐదువందల పదిహేడు మాత్రమే)	బాకీపడిన మొత్తం 16-02-2024. నాటికి Rs. 33,21,367 /-	లాంఛనప్రాయ స్వాధీనతా 27/06/2023; బిడ్ పెంపుదల మొత్తాలు రూ.10,000/-	Rs. 28,80,000 /-; ధరావత్తు (ఈఎండి): రూ.2,88,000/-	15-04-2024 & 22-04-2024 1100 hrs -1400 hrs; ధరావత్తుకు చివరి తేది: 06.05.2024న సా.500గం.లు; ఇ-వేలం తేది/సమయం: 07-05-2024 1100 hrs-1300 hrs.
స్థిరాస్తి/ సెక్యూర్డు అసెట్ యొక్క వివరణ: గుంటూరు జిల్లా, గుంటూరు ఉప జిల్లా, ప్రస్తుతం కొరిటెపాడు ఉప జిల్లాలోపు, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో లేని టౌన్‌సర్వే గోరంట్ల గ్రామం డి.నెం.476, ఎక10-06 సెంట్లు దాని నుండిప్లాట్లుగా విభజించబడింది. ప్లాట్ నెం.656 కలిగిన 200చ.గ.ల సైట్ విస్తీర్ణం. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం.ఏ-655 సైటు-54'-0", పడమర: 33అ.ల వెడల్పు రోడ్డు-33'4', ఉత్తరం: ప్లాట్ నెం.ఏ-657 సైటు-54'-0", దక్షిణం: ప్లాట్ నెం.ఏ-655 సైటు-54'-0". ఈ సరిహద్దుల్లో 200 చ.గ.లు లేదా 167-23 చ.మీ.ల ఖాళీ స్థలం మాత్రమే.					

చెల్లింపు విధానం: చెల్లింపులన్నింటిని హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున విజయవాడ వద్ద చెల్లుబడునట్లుగా డిమాండ్ డ్రాఫ్టు ద్వారా లేదా ఆర్‌టిజిఎస్/ఎన్ఇఎఫ్‌టి ద్వారా చేయవలెను, ఖాతాల వివరాలు దిగువ విధంగా ఉన్నవి: ఎ) ఖాతాదారు పేరు: హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, బి) బ్యాంకు పేరు: హెచ్‌డిఎఫ్‌సి, సి) ఖాతా నెంబరు HHFLTDAPHDBLBNGA103 డి) IFSC Code: HDFC0004989.

ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకపు నియమ & నిబంధనలు: [illegible]

తేది: 03-04-2024, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

[illegible]

Chola Enter a better life
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ కార్యాలయం: చోలా క్రెస్ట్, సూపర్ బి, సి54 మరియు సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600 032.

స్వాధీనత నోటీసు [(అనుబంధం IV) (రూల్ 8(1) క్రింద]

ఏదైతే మెస్సర్స్ **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోపట దానిపిమ్మట వడ్డీ మరియు సదరు నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు రుణగ్రహీతలు (పేరులు మరియు చిరునామా దిగువ పేర్కొనబడినాయి) పిలుస్తూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు జారీచేయబడింది. రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమేమనగా, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద నా అధికారాలు అధ్యాయనం చేస్తూ ఇక్కడ దిగువ వివరించిన ఆస్తిని దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైంది. ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు ఇక్కడ క్రింద పేర్కొన్న మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీ మెస్సర్స్. **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క చార్జ్‌కు లోబడి జరుపవచ్చును. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు, చట్టంలోని సెక్షన్13 యొక్క సబ్-సెక్షన్ 8 నిబంధనలు అహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించగలరు.

క్ర సం	రుణగ్రహీత/లు పేరు మరియు చిరునామా మరియు రుణ ఖాతా నెంబర్	డిమాండ్ నోటీసు తేది	బాకీపడిన మొత్తం	స్వాధీనతా ఆస్తి వివరణ	స్వాధీనతా తేది
1.	రుణ ఖాతా నెం(లు): **X0HLVJI00002211286** 1. పోతంశెట్టి నరసింహారావు, గుండెబొమ్మ లక్ష్మి, ఇరువురి నివాసం: డో.నం.67-1-11, దర్శిపేట, పటమట విజయవాడ కృష్ణాజిల్లా-520010. **ఇక్కడ కూడా :** డో.నం.67-1-11, దర్శిపేట, పటమట, విజయవాడ, ఎన్ఎస్ఎమ్ స్కూల్ రోడ్డు కృష్ణ 520010.	17-01-2024	**13.01.2024** నాటికి **రూ.25,12,428/-** (ఇరవై ఐదు లక్షల పన్నెండు వేల నాలుగు వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	ఎన్‌టిఆర్ జిల్లా (పాత కృష్ణాజిల్లా) విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, పటమట బేరింగ్ ఆర్.ఎస్.నం.64/1, 64/2, డో.నం.67-1-11, విస్తీర్ణం 113.17 చ.గ.లు. జి+1 భవనం ఉన్న హద్దులు : **ఉత్తరం : మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, దక్షిణం : షేక్ సిద్ద బాబు ఆస్తి, తూర్పు : వై.అచ్చమ్మ ఆస్తి, పడమర : జి.లక్ష్మి ఆస్తి.** తో అన్నీ సౌలభ్య హక్కులు.	స్వాధీనత తేది: 29-మార్చి-2024

తేది: 29-మార్చి-2024
ప్రదేశం: విజయవాడ
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, తరపున అధీకృత అధికారి

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor, Door No. 31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

O.A. No. 1291 of 2023

BETWEEN:
Union Bank of India, Benz Circle Branch, Vijayawada,
Represented by its Senior Manager ... **Applicant**
AND :
Yarlagada Venkata Swarna Kumari & one another ... Defendants

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To
1 : Yarlagada Venkata Swarna Kumari, W/o. Y. Paradhasaradhi, Flat No. SA-4, Sravya Blocks, Sri Ram's Golden Nest, Chinnaoutpalli (V), Atkuru Mandal, Krishna Dt., AP.
2 : Mrs. Yarlagada Paradhasaradhi, S/o. Sivaramaiah, Flat No. SA-4, Sravya Blocks, Sri Ram's Golden Nest, Chinnaoutpalli (V), Atkuru Mandal, Krishna Dt., AP.

1) Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you (Defendants 1 to 3) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m, or at such time immediately thereafter according to the convenience of Tribunal **on 03-05-2024** to answered the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents, you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determine in your absence.
Given under my hand and seal of the Tribunal on this the 1st day of April, 2024 at Visakhapatnam.

Signature of the Officer Authorised
Debts Recovery Tribunal
Visakhapatnam

సంపాదకీయం

మనువాద మస్తిష్కం!

ఒక దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని స్వయానా ఆ దేశాధ్యక్షులు అందజేస్తున్నప్పుడు పక్కనే వున్న వారంతా లేచి నిలబడటం కనీస మర్యాద. ఆ సంప్రదాయం సైతం పదేళ్లపాటు ప్రధానిగా పదవి వెలగబెట్టిన నేతకు తెలియదా అని ప్రపంచం ఎద్దేవా చేస్తోంది. భారతదేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని 96 ఏళ్ల ఎల్‌కె అద్వానీకి ఆయన నివాసంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. ఇప్పటికే అనారోగ్యంతో ఉన్న ఆయన... ఆ వయసులో లేచి నిలబడలేకపోవచ్చు. అవార్డు అందజేస్తున్నప్పుడు, ఆ తరువాత ఫొటో తీస్తున్నప్పుడు అద్వానీ పక్కనే ఆశీనులై ఉన్న ప్రధాని నరేంద్రమోడీ కనీసం లేచి నిలబడలేదు. దేశ ప్రథమ పౌరురాలి పట్ల ప్రధాని తీరు అధ్యక్ష పదవిని, యావత్ మహిళలను, ఆదివాసీలను అవమానించడమే. ఆదివాసీ అంటే అంత చులకనా? రాష్ట్రపతి పదవి అంటే అంత లెక్కలేనితనమా? ప్రజాస్వామ్యమంటే అంత ఖాతరులేనితనమా? మనుస్మృతి నిచ్చెనమెట్ల వ్యవస్థలో దిగువున ఉన్న వారి పట్ల తృణీకార ధోరణా?

అంతకుముందు రోజే రాష్ట్రపతి భవన్‌లో భారతరత్న ప్రకటించిన వారి వారసులకు రాష్ట్రపతి ముర్ము అవార్డులను ప్రదానం చేశారు. అనారోగ్య కారణాల వల్ల అద్వానీ ఆ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. రాష్ట్రపతి ముర్ము స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి భారతరత్నను ప్రదానం చేశారు. ఈ అవార్డు ప్రదానానికి ప్రధానమంత్రి మోడీ, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రపతి ముర్ము అవార్డు ప్రదానం చేస్తుండగా, అద్వానీ పక్కనే ప్రధాని కూర్చొనివుండడం, అందునా రాష్ట్రపతి నిలబడి అవార్డు ప్రదానం చేస్తుండగా కూర్చుని వుండడం రాష్ట్రపతిని అవమానించడమే. అంతేకాదు తన రాజకీయ ఉన్నతికి కారణమైన అద్వానీకిసైతం ఆయనేమీ గౌరవం ఇవ్వదలచుకోలేదు. 2002లో గుజరాత్ మారణహోమం సాగినప్పుడు అప్పటి ప్రధాని వాజ్‌పేయి 'రాజధర్మం' పాటించలేదంటూ సిఎంగా ఉన్న మోడీని పక్కనపెట్టేందుకు సిద్ధమయ్యారని ప్రచారం ఉంది. ఆ సమయంలో అద్వానీ, ఆర్‌ఎస్‌ఎస్ అడ్డుపడి మోడీ పదవికి గండం వాటిల్లకుండా కాపాడారని చెబుతారు. ఆ కృతజ్ఞత సైతం అద్వానీ పట్ల కనిపించదు.

ఆర్‌ఎస్‌ఎస్ డిఎన్‌ఎలోనే మనుస్మృతి అంతర్భాగంగా ఉంది. బ్రహ్మ నుదుటి నుంచి బ్రాహ్మణులు, భుజాల నుంచి క్షత్రియులు, తొడల నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు వచ్చారంటూ నిచ్చెనమెట్ల వ్యవస్థను ప్రచారం చేస్తుంది. అందులో మరింత దిగువున ఉన్న దళిత, ఆదివాసీల పట్ల విషం కక్కడం ఆర్‌ఎస్‌ఎస్‌కి అలవాటే. రాష్ట్రపతిగా పనిచేసిన రామ్‌నాథ్ కోవింద్ వీడ్కోలు సభ సందర్భంగా ఆయనకు అభివాదం చేయలేదంటూ అప్పట్లో ప్రధానిపై విమర్శలు వచ్చాయి. తాజాగా, ఆదివాసీ మహిళ అయిన రాష్ట్రపతి ముర్ము పట్ల అనుసరించిన వైఖరి చర్చనీయాంశమైంది. ఇంతకుముందు కూడా ఆమె పట్ల ఇదేవిధమైన వైఖరిని అనుసరించారు. రాష్ట్రపతి దేశ అత్యున్నత శాసన వ్యవస్థ పరిరక్షకులు. అందుకే రాష్ట్రపతికి పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సైతం ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించే గౌరవం కల్పించబడింది. అటువంటి రాజ్యాంగాధినేతను నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం సందర్భంగా పిలవకపోవడం అప్పట్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఆ తరువాత ప్రధాని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రచారం చేసుకున్న అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికీ పిలవలేదు. ఆమె వితంతువైనందున ఆ కార్యక్రమాలకు పిలవలేదా? అనే ప్రశ్నలు కూడా ఎదురయ్యాయి.

మనుషులందరికీ సమాన గౌరవం ఇవ్వలేదంటూ అంబేద్కర్ తగులబెట్టిన మనుధర్మ శాస్త్రాన్ని నెత్తికెత్తుకున్న నేటి పాలకులు అందులోని విద్వేషాన్ని. విషాన్ని తమకు మించి ఎవరూ అమలు చేయలేరని నిరూపించదలచుకున్నారు! ముస్లిములపై, దళితులపై పశువుల మాంసం తింటున్నారంటూ విద్వేషం నింపడం, దాడులు చేసి చంపేయడం బిజెపి పాలనలో నిత్యకృత్యమే! అదే సమయంలో పశువుల మాంసం ఎగుమతుల్లో ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలవడం మోడీ సర్కారు సాధించిన ఘనత! భారతీయులంతా సహోదరులన్న స్పృహ, అందరి పట్ల సమాన గౌరవం, రాజ్యాంగం పట్ల, రాజ్యాంగ సంస్థల పట్ల గౌరవం ప్రజాస్వామ్య పాలకులకు అత్యవసరం. అవేవీ కనుచూపు మేరలో కనిపించని నిరంకుశ మనువాద పాలనకు మచ్చుతునకగా మోడీ సర్కారు చర్యలు నిలిచిపోతాయి!

మహనీయుల మాట

చరిత్రే నిజమైన ఉపాధ్యాయుడు.
కార్మిక వర్గానికి
విప్లవమే అత్యుత్తమ పాఠశాల.
- రోజా లగ్జెంబర్గ్

హిందూత్వతో సామాజిక న్యాయం సాధ్యం కాదు

విశ్లేషణ

బి.వి. రాఘవులు

ప్రధాని నరేంద్ర మోడీ, 'సనాతన ధర్మానికి' తన మద్దతును బహిరంగంగా ప్రకటించినప్పుడే అసలు గుట్టు బయట పడింది. సామాజిక న్యాయాన్ని, సమానత్వ భావనను 'సనాతన ధర్మం' తిరస్కరిస్తుందని ఉదయనిధి స్టాలిన్ గతేడాది సెప్టెంబరులో చాలా పదునైన, విమర్శనాత్మక వ్యాఖ్యలు చేసినప్పుడు, మోడీ ఆ సనాతన ధర్మాన్ని గట్టిగా సమర్థించారు. 'సనాతన ధర్మ' వినాశనమే లక్ష్యంగా ఓ రహస్య ఎజెండా నడుస్తోందంటూ తమ వ్యతిరేకులను తీవ్రంగా నిందించారు. సనాతన ధర్మ' విరోధులపై ఎదురుదాడి చేయడానికి హిందూత్వ ప్రచారదళంలో భాగస్వాములయ్యేలా మంత్రుల్ని, తన పార్టీ సభ్యుల్ని సైతం పురిగొల్పారు. ఒకవైపు సామాజిక న్యాయం కోసం, దళితుల గౌరవ ప్రతిష్టల కోసం తాను కట్టుబడి వున్నట్టు పదే పదే మోడీ చేస్తున్న ప్రకటనలు బూటకమని, అంబేద్కర్‌పై ఆయన కురిపిస్తున్న ప్రశంసలు, సంత్ రవిదాస్ విగ్రహం పట్ల ఆయన చూపిస్తున్న భక్తి యావత్తూ ఒట్టి డొల్ల మాత్రమేనని మోడీ తాజా ప్రకటన తేటతెల్లం చేస్తోంది.

"భారత దేశాన్ని వేల సంవత్సరాల పాటు ఐక్యంగా ఉంచిన ఆలోచనలు, విలువలు, సాంప్రదాయాలు అన్నీ కలిసి 'సనాతన ధర్మం'గా ఉన్నట్టు మోడీ ప్రకటించారు. అయితే 'ప్రాచీన', 'శాశ్వత', 'సార్వత్రిక సత్యాలు లేదా ధర్మాలు' లాంటి అస్పష్టమైన పదాలను తప్ప, 'సనాతన ధర్మం' చెప్పే ఆలోచనలు, విలువలు, సాంప్రదాయాలు ఏమిటి అన్న సంగతిని మోడీగానీ, ఎదుటివారిని తిట్టిపోయడమే పనిగా పెట్టుకున్న అతగాడి అనుచర దళంగాని వివరించలేదు. 'సనాతన ధర్మం' యొక్క మౌలికమైన, ప్రత్యేకమైన 'వర్ణ లేదా కుల వ్యవస్థ' లక్షణాన్ని మరుగుపరచడం కోసమే ఏ వివరణా ఇవ్వలేదు.

అన్ని హంగులూ కలిగివున్న అతగాడి సేనానులు తమ మాటల గారడీతో సనాతన ధర్మానికి కొమ్ము కాయడానికి తయారయ్యారు. లోకజ్ఞానం, మానవ విలువలు, వ్యక్తిగత విధులు, బాధ్యతలు, ప్రవర్తనా ప్రమాణాలు, నైతిక విలువలు లాంటి మాటల ముసుగులో దాని అసలు సారాంశాన్ని కప్పిపుచ్చుతున్నారు. 'సనాతన ధర్మం' యొక్క నిజ స్వభావాన్ని దాచిపెట్టడానికి దాని చుట్టూ కళ్లకు పొరలు కమ్మేలా మాయావాదాన్ని అల్లుతున్నారు. దీనిని సద్గురు వాసుదేవ్ లాంటి ప్రముఖులిచ్చిన వివరణల్లో మనం చూడవచ్చు. "ఈ సనాతన ధర్మం అనే ప్రక్రియ నీలో ప్రశ్నలు రేకెత్తించడం కోసమే ఉంది. ఆ ప్రశ్నల లోతుల్లోకి పోయి దీనంతటికీ మూలం ఏమిటో నువ్వే సహజంగా తెలుసుకుంటావు". ఇలాంటి మరొక గురువు 'సనాతన ధర్మం' "అందర్నీ ప్రేమించి, అందర్నీ కలుపుకొని పోతుందని" వ్యాఖ్యానించాడు. ఒకవేళ మనం ఈ వాదనలను 'సనాతన ధర్మం' యొక్క సారంగా అంగీకరించినా, ఇలాంటి శాశ్వతమైన సత్యాలే మనకు అన్ని మతాల్లో నూ కనిపిస్తాయి. కాని, అమానవీయ కుల, లింగ వివక్షతను ఎదుర్కొంటున్న దళితులు, ఇతర బలహీన కులాల వారి దైనందిన జీవితానుభవాల నుండి తలెత్తే ప్రశ్నలకు ఇటాంటి వాదనలు ఏ సమాధానాన్నీ ఇవ్వగల పరిస్థితి లేదు.

ఇంతకూ సనాతన ధర్మం ప్రత్యేకత ఏమిటి? ఏ మాత్రమూ సమర్థించుకోలేని స్థితిలో ఉన్న హిందూత్వ తత్వవేత్తలు తప్పించుకోవడానికి ఇచ్చే వివరణలు, వ్యక్తం చేసే ధర్మాగ్రహం మాట ఎలా వుందన్నదానితో నిమిత్తం లేకుండా వారు సనాతన ధర్మంలో ఉన్న శాశ్వతమైన సత్యాన్ని కప్పిపుచ్చలేరు. కఠినమైన, అమానవీయ, వారసత్వ, పుట్టుక ఆధారిత, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను దాచి ఉంచలేరు. అత్యంత నిరంకుశమైన, హానికరమైన 'వర్ణాశ్రమ ధర్మం' లేక 'కుల ధర్మం' కొన్ని వేల సంవత్సరాలుగా భారతదేశమంతా విస్తరించివున్న ఏకైక ముఖ్యమైన ఆలోచన, విలువ, సాంప్రదాయం అనే వాస్తవాన్ని వారు విస్మరిస్తున్నట్టు భావించాలి. కాబట్టి మోడీ, సంఘ్ పరివార్ ప్రత్యేకమైన బుద్ధి మాంద్యంతో బాధపడుతున్నట్లు భావించాలి. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మ సూత్రాలు, గృహ్య సూత్రాలు (గృహస్థులు ఆచరించాల్సిన ధర్మాలు, సంస్కారాలు), పురాణాలు, భగవద్గీత అన్నీ వర్ణ లేదా కుల వ్యవస్థను సమర్థిస్తాయి. ఈ వాస్తవాన్ని వారు నిరాకరించగలరా? వర్ణ ధర్మం నుండి పక్కకు మళ్ళుతున్నందుకు కఠినమైన శిక్షను విధించడమే కాక, వర్ణ ధర్మ పరిరక్షణ పాలకుల ప్రాథమికమైన బాధ్యత అని చెప్పే మనుస్మృతిని మనం పట్టించుకోకూడదని వారు కోరుకుంటున్నారా?

> దళిత గౌరవానికి ప్రతీకగా ఉన్న అంబేద్కర్ యొక్క సమానత్వ, ఆత్మగౌరవ దార్శనికతను నెరవేర్చడానికి తాను కృషి చేస్తున్నట్టు మోడీ చెప్పుకునేదంతా ఒట్టి నటనేనని గత దశాబ్దపు మోడీ పాలనా కాలపు అనుభవం స్పష్టం చేస్తోంది. నిజానికి మన దేశంలో పీడితులు, దోపిడీకి గురైన ప్రజలు పోరాటాల ద్వారా సాధించుకున్న కొన్ని అధికారిక హక్కులు, కొద్దిపాటి గౌరవాన్ని అతని పాలన ఒక క్రమపద్ధతిలో ధ్వంసం చేసింది. పెరిగిపోతున్న నేరాల రేటు, కుంచించుకు పోతున్న ఉద్యోగావకాశాలు, పెరిగిపోతున్న ఆర్థిక వివక్షత, గజారుతున్న దళితుల, గిరిజనుల జీవన స్థితిగతులు చూస్తే మనకు ఈ సంగతి స్పష్టంగా కనిపిస్తుంది.

ఒకవేళ 'కుల వ్యవస్థ వేరు, సనాతన ధర్మం వేరు' అని కుల వ్యవస్థను బలపరిచే వాదనలతో విడగొట్టుకోవాలనుకుంటే, మోడీ ఆ విషయాన్ని ముందు స్పష్టం చేయాలి. ఆ తర్వాతనే తన వ్యతిరేకుల మీద విమర్శలకు పూనుకోవాలి. అది అతనికి కచ్చితంగా తెలియకుంటే శ్రేణీగత, వివక్షాపూరిత 'వర్ణ లేదా కుల ధర్మం' వారి పవిత్రమైన గ్రంథాల్లో భాగంగా ఉన్నాయా లేవా అనే విషయంపై వివరణ ఇమ్మనమని వారు సాధువుల్ని, మత ప్రచారకులని, శంకరాచార్యుల్ని వేడుకోవచ్చు. అయితే, మోడీ ఈ పని చేస్తారని ఎలా ఆశించగలం? అలా అతని కపటత్వం బైట పడుతుంది కదా?

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల నుండి తలెత్తిన వివాదం హిందూత్వ దళం అసలు రంగును ప్రజల ముందు బయటపెట్టింది. మోడీ, ఆయన అనుచర గణం తాము 19వ శతాబ్దానికి చెందిన అభివృద్ధి నిరోధకులైన సనాతనవాదులకు నిజమైన వారసులుగా మన ముందు నిలబడ్డారు. ఆ కాలంలో బ్రహ్మ సమాజం, ఆర్య సమాజ్, ప్రార్థనా సమాజ్, రామకృష్ణ మిషన్ వంటి సంస్థలు హిందూ మతానికి అనేక సంస్కరణలు ప్రతిపాదించాయి. ఆ సంస్కరణలను వ్యతిరేకిస్తూ పలు ఛాందసవాద, సాంప్రదాయ హిందూ సంస్థలు పుట్టుకొచ్చాయి. ఆ సంస్థల నాయకులే, 'సనాతన ధర్మానికి' ప్రాచుర్యం కల్పించారు. 'హిందూ' అనే పదం పర్షియన్ మూలాలు కలిగి ఉన్నందువల్ల ఈ 'సనాతన వాద' సేవా తత్పరులు 'హిందూ' పదాన్ని ఇష్టపడక, దానికి బదులుగా 'సనాతన ధర్మం' అనే పదానికి ప్రాధాన్యత ఇవ్వడం ఆసక్తికరమైన విషయం.

దళిత గౌరవానికి ప్రతీకగా ఉన్న అంబేద్కర్ యొక్క సమానత్వ, ఆత్మగౌరవ దార్శనికతను నెరవేర్చడానికి తాను కృషి చేస్తున్నట్టు మోడీ చెప్పుకునేదంతా ఒట్టి నటనేనని గత దశాబ్దపు మోడీ పాలనా కాలపు అనుభవం స్పష్టం చేస్తోంది. నిజానికి మన దేశంలో పీడితులు, దోపిడీకి గురైన ప్రజలు పోరాటాల ద్వారా సాధించుకున్న కొన్ని అధికారిక హక్కులు, కొద్దిపాటి గౌరవాన్ని అతని పాలన ఒక క్రమపద్ధతిలో ధ్వంసం చేసింది. పెరిగిపోతున్న నేరాల రేటు, కుంచించుకుపోతున్న ఉద్యోగావకాశాలు, పెరిగిపోతున్న ఆర్థిక వివక్షత, దిగజారుతున్న దళితుల, గిరిజనుల జీవన స్థితిగతులు చూస్తే మనకు ఈ సంగతి స్పష్టంగా కనిపిస్తుంది.

మోడీ హిందూత్వ, కార్పొరేట్ పాలనలో దళితులపై, గిరిజనులపై సాగుతున్న అత్యాచారాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇది, సమాజం మొత్తంగా మనువాద భావజాల ప్రభావంలో చిక్కుకుపోయిన వైనాన్ని సూచిస్తుంది. 2018 నుండి గడిచిన నాలుగేళ్ల కాలంలో దళితులపై 1.9 లక్షలకు పైగా అత్యాచారాలు జరిగినట్టు కేసులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్ ఈ ఆగడాలకు, దాడులకు (మొత్తం 49,613 కేసులతో) ప్రధాన కేంద్రంగా నిలిచింది. 2022వ సంవత్సరాన్ని 2021తో పోల్చితే షెడ్యూల్డ్ కులాల వారిపై 13 శాతం అత్యాచార కేసులు పెరగ్గా, షెడ్యూల్డ్ తెగలపై 14.3 శాతం పెరిగాయి. ఎస్సీలపై అత్యాచారాల కేసుల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. అంటే మొత్తం కేసుల్లో 26 శాతం. రాజస్థాన్ 15 శాతం, మధ్యప్రదేశ్ 14 శాతంగా ఉంది. ఎస్టీలపై అత్యాచారాల కేసుల విషయం పరిశీలించినట్లయితే మొత్తం కేసుల్లో 30 శాతంతో మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా, 24 శాతంతో రాజస్థాన్, 7.6 శాతంతో ఒడిశా ఉన్నాయి.

అత్యాచారాల సంఖ్య పెరగడంతో పాటు, ఆ ఘటనలలోని క్రూరత్వం దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. ఏడుగురు దళిత యువకులను గుజరాత్ లోని ఉనాలో బహిరంగంగా కొట్టడం, ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో ఒక దళిత మహిళపై అత్యంత క్రూరంగా జరిపిన సామూహిక అత్యాచారం ఆమె మరణానికి దారితీయడం, మధ్యప్రదేశ్‌లో సోధీ ఘటనలో ఓ బిజెపి నాయకుడు ఓ గిరిజనుడిపై మూత్ర విసర్జన చేయడం లాంటి సంఘటనలు దేశం అంతరాత్మను కుదిపివేశాయి. సంఘ్ పరివార్, హిందూత్వ శక్తుల అండతో బిజెపి ప్రభుత్వాలు సృష్టించిన మనువాద వాతావరణంలో దళితులకు, గిరిజనులకు వ్యతిరేకంగా ఇలాంటి హేయమైన నేరాలు పాల్పడడానికి కులతత్వ శక్తులెలా ప్రోత్సాహం ఇస్తున్నాయో ఈ భయంకరమైన చర్యలు తెలియజేస్తున్నాయి.

ఇవే శక్తులు, సమాజంలోని సామాజిక పీడిత వర్గాలకు సహాయ పడేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకుంటూ తీసుకునే చర్యలను సైతం వ్యతిరేకించే శత్రుపూరిత వాతావరణాన్ని ఒక క్రమపద్ధతిలో పెంచి పోషిస్తున్నాయి. బిజెపి పాలనలో బలహీన వర్గాలకు లభించే కొద్దిపాటి ప్రయోజనాలను కాలరాసేందుకు ప్రభుత్వమే ఈ శక్తులతో లాలూచీ పడుతున్నది.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పనితీరు చాలా అన్యాయంగా ఉంది. 2022 మార్చి 24న పార్లమెంట్‌లో సమర్పించిన సమాచారం ప్రకారం తొమ్మిది మంత్రిత్వ శాఖలు-రైల్వేలు, ఆర్థిక, ఆటమిక్ ఎనర్జీ, రక్షణ, గృహ నిర్మాణం, హోం శాఖలతో-సహ కేంద్ర ప్రభుత్వ శాఖలన్నింటిలో మొత్తం 82,022 ఖాళీలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వ్ చేయబడిన పోస్టులున్నాయి. కానీ వాటిలో కేవలం 42 శాతం పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. యూనివర్శిటీలు, ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో పరిస్థితి కూడా చాలా ఘోరంగా ఉంది. ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 42 శాతం ఖాళీ పోస్టులు, ఎస్టీలకు రిజర్వ్ చేయబడిన 39 శాతం, ఓబీసీ లకు రిజర్వ్ చేయబడిన 54 శాతం ఖాళీ పోస్టుల్ని భర్తీ చేయడంలో 45 సెంట్రల్ యూనివర్శిటీలు విఫలమయ్యాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 80 శాతం ఖాళీ పోస్టులను ఇంత వరకు భర్తీ చేయకపోవడం ఆ సంస్థలో సామాజిక న్యాయం అత్యంత అధ్వాన్నమైన స్థితిలో వున్నదని తెలియజేస్తోంది.

మోడీ నాయకత్వంలో ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ సేవలు, ఉన్నత విద్య ప్రైవేటీకరించబడుతున్నాయి. దానికి తోడు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల విధానమే లేదు. ఈ విధంగా ప్రభుత్వం రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ ఆదేశాలను పాటించకపోవడమేగాక ఆ ఆదేశాలనే నీరుగారుస్తోంది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయింపుల గణనీయమైన తగ్గింపు, ఖర్చులలో కోతలు విధించడం ద్వారా వివక్షత కొనసాగింపులో మోడీ ప్రభుత్వమే ప్రత్యక్షంగా భాగస్వామి అయ్యింది. 2014-20 మధ్య జనాభా దామాషా ఆధారంగా జరిగిన మొత్తం కేటాయింపుల్లో కేవలం 20.8 శాతం మాత్రమే వారి సంక్షేమానికి ఖర్చు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలు తెలియజేస్తున్నాయి. అంటే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయంగా చెల్లించాల్సిన 7.51 లక్షల కోట్ల రూపాయలను నిలిపివేశారన్నమాట. దీనితో పాటు 2017-18లో ఎస్సీ సబ్‌ప్లాన్, ఎస్టీ సబ్‌ప్లాన్లను రద్దు చేయడం ద్వారా మోడీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఉద్దేశించబడిన యంత్రాంగాన్ని ధ్వంసం చేసింది.

ఈ మార్పుల ఫలితంగా మోడీ రెండోసారి ప్రధాని పదవి చేపట్టిన 2019-2024 మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వ, కేంద్ర రంగ ప్రాయోజిత పథకాల కేటాయింపుల మొత్తం నిధుల్లో ఎస్సీలకు కేవలం 10.6 శాతం మాత్రమే కేటాయించారు. కేటాయింపుల్లో కూడా కేవలం 3.3 శాతం మాత్రమే ఎస్సీల పథకాలకు మళ్ళించారు. మిగిలినవి సాధారణ పథకాలకు కేటాయించారు. ఎస్టీలకు ఉద్దేశించబడిన కేటాయింపుల్లో కూడా ఇదే వైఖరిని ప్రదర్శించారు. ఎస్టీలకు కేటాయించిన మొత్తం నిధుల్లో కేవలం 2.5 శాతం మాత్రమే లక్ష్య పథకాలకు కేటాయించారు. కేటాయించిన నిధుల్ని కూడా పూర్తి స్థాయిలో వినియోగించలేదు.

స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా సాధారణ దళితుల పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. 58 శాతం దళితులకు భూమి లేదు. మోడీ పరిపాలనలో ఆదివాసీలను, దళితులను పెద్ద సంఖ్యలో అభివృద్ధి పేరుతో వారి భూముల నుండి బలవంతంగా వెళ్ళగొడుతున్నారు. స్వంత భూములున్న 50 శాతం దళితులకు సాగునీటి సౌకర్యాలు లేవు. సాధారణ జనాభాలో 33.3 శాతం జనాభాతో పోల్చినప్పుడు 65.8 శాతం దళితులు, 81.4 శాతం గిరిజనులు బహు మితీయ (మల్టీ డైమెన్షనల్) పేదరికంలో జీవిస్తున్నారు, ఇది చాలా తీవ్రమైన పరిస్థితి. ఎస్సీలలో అక్షరాస్యతా రేటు కేవలం 66 శాతంగానే ఉండగా, ఎస్టీల్లో అది 59 శాతం కన్నా తక్కువగా ఉంది, అంటే జాతీయ సగటు రేటు 73 శాతం కంటే కూడా తక్కువగా ఉంది. అంతే కాకుండా 2022 నాటికి ఎస్సీలలో నిరుద్యోగ రేటు 8.4 శాతంగా చాలా ఎక్కువగా ఉంది. ఎస్సీలలో అసంఘటిత రంగ కార్మికులు చాలా ఎక్కువగా 84 శాతంగా ఉన్నారు. ఈ గణాంకాలు మోడీ నాయకత్వంలోని మతతత్వ, కార్పొరేట్ ప్రభుత్వం యొక్క దళిత వ్యతిరేక, పేద ప్రజల వ్యతిరేక స్వభావాన్ని తెలియజేస్తుంది. మోడీ హిందూత్వ లేక 'సనాతన ధర్మ' భావజాలంలో సామాజిక న్యాయాన్ని వెతకడం అంటే ఎండమావిలో నీటిని వెతకడం లాంటిదే.

/ వ్యాసకర్త సిపిఐఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /

★

ఐరోపా రైతాంగం ఆందోళన - కారణాలు

అంతర్జాతీయం

ఎం. కోటేశ్వరరావు

సబ్సిడీల కోతలతో పాటు, చౌకగా ఉత్పత్తుల దిగుమతులతో సాగు గిట్టుబాటు కావటం లేదు. అనేక దేశాలు, ఐరోపా పార్లమెంట్‌కు ఎన్నికల సంవత్సరమిది. మమ్మల్ని నానా కష్టాలు పెడుతున్న మీరు మమ్మల్ని ఎలా ఓటు అడుగుతారో, మా జీవితాలను ఫణంగా పెట్టి పాలన ఎలా సాగిస్తారో చూస్తామంటూ అనేక దేశాల్లో రైతాంగం ఆందోళన బాట పట్టింది.

స్పెయిన్ అనుభవమే తీసుకుందాం. అక్కడ మార్కెట్ యార్డులు లేవు. ప్రభుత్వం కొనుగోలు చేయదు. ఐరోపాలో జరుగుతున్న ఆందోళనలో స్పెయిన్ రైతులు ముందున్నారని పత్రికల్లో విశ్లేషణలు వచ్చాయి. టోకు సూపర్ మార్కెట్ల యజమానులు రైతాంగానికి సరసమైన ధరలు చెల్లించి ఉత్పత్తులను కొనుగోలు చేయాలని అక్కడ చట్టం ఉంది. దాన్ని అమలు జరిపేవారు లేకపోవటంతో రైతులు పోరు బాట పట్టారు. మన దేశంలో కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌తో ఆందోళన సాగుతున్న సంగతి తెలిసిందే. వినియోగదారులకు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి, తమ ఉత్పత్తులకు ధర రావటం లేదని, ఇతర దేశాల నుంచి పోటీ, 2012 నుంచి 2022 మధ్య కాలంలో దిగుమతులు ఎనభైశాతం పెరిగినట్లు స్పెయిన్ రైతులు చెబుతున్నారు. 2023 జూన్-సెప్టెంబరు మాసాల మధ్య అంతకు ముందు ఏడాది వచ్చిన సగటు ధరలకంటే రైతుల ఉత్పత్తుల ధరలు తొమ్మిదిశాతం తగ్గినట్లు తేలింది. మరోవైపున సాగు ఖర్చుల పెరుగుదల, పర్యావరణ పరిరక్షణ పేరుతో అమలు జరుపుతున్న నిబంధనలు, నియంత్రణ, చౌకధరలకు దిగుమతులతో తీవ్రమైన విదేశీ పోటీని అక్కడి వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్నది.

ఐరోపా పారిశ్రామిక, సేవారంగ కార్పొరేట్ల నుంచి వస్తున్న ఒత్తిడిని తక్కువ అంచనా వేయకూడదు. ఐరోపా సమాఖ్య దేశాల జిడిపిలో వ్యవసాయ రంగం నుంచి వస్తున్నది కేవలం 1.4 శాతం, ఉపాధి కల్పిస్తున్నది 4.2 శాతం మందికి మాత్రమే కాగా సమాఖ్య బడ్జెట్‌లో వ్యవసాయ రంగం 30 శాతం పొందుతున్నదని కొందరు లెక్కలు చెబుతున్నారు. దీన్ని మరో విధంగా చెప్పాలంటే అంతకంటే తక్కువ ఖర్చుతో దిగుమతులు చేసుకొని కడుపు నింపుకోవచ్చు, ఇక్కడ సాగు ఎందుకు అని ప్రశ్నించటమే. 1960లో స్పెయిన్ జిడిపిలో వ్యవసాయ వాటా 23.5 శాతం కాగా 2022 నాటికి 2.6 శాతానికి, ఉపాధి 39 నుంచి 3.6 శాతానికి తగ్గింది. నియంత ఫ్రాంకో పాలనలో మార్కెట్ ఎకానమీకి మారిన తరువాత జరిగిన పరిణామమిది. పారిశ్రామిక రంగ జిడిపి వాటా కూడా ఇదే కాలంలో 30.8 నుంచి 17.4 శాతానికి తగ్గగా సేవారంగం 41.7 నుంచి 74.6 శాతానికి పెరిగింది. ప్రస్తుతం పారిశ్రామిక రంగంలో 11.3 శాతం మందికి ఉపాధి దొరుకుతుండగా సేవా రంగంలో 78.2 శాతం ఉన్నారు.

జర్మనీలో రైతుల సమ్మె...

రైతుల ఆందోళన కారణంగా స్థానిక ప్రభుత్వాలు, ఐరోపా సమాఖ్య కొన్ని నిబంధనలను సడలించింది, మరికొన్నింటిని వాయిదా వేసినప్పటికీ మెడ మీద కత్తిలా వేలాడుతూనే ఉన్నాయి. వ్యవసాయం, అనుబంధ రంగాల నుంచి పర్యావరణానికి హాని కలిగించే వాయువుల విడుదలను 2040 నాటికి తగ్గించేందుకు ఒక ప్రణాళికను రూపొందించారు. మీథేన్, నైట్రోజన్ తదితర వాయువులను 30 శాతం తగ్గించాలన్నది ఒకటి. ఓజోన్ పొరను దెబ్బతీసే వాయువులు వ్యవసాయ రంగం నుంచి 14.2 శాతం వెలువడుతున్నాయని 2050 నాటికి వాటిని సున్నాకు తగ్గించాలన్నది మరొక లక్ష్యం. ఇందుకోసం నిబంధనల జారీ, వాటి అమలుతో రైతాంగం ఆందోళనబాట పట్టారు. మన మీద కూడా దాని ప్రభావం కనిపిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఐదు పంటలకు ఐదు సంవత్సరాల పాటు కనీస మద్దతు ధరకు హామీ ఇస్తామని చెబుతూ పంటల మార్పిడి విధానం అనుసరించిన రైతులకే అది వర్తిస్తుందనే షరతు పెట్టిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ మీద రష్యా దాడులు జరుపుతోంది గనుక అక్కడి నుంచి ఎలాంటి దిగుమతి పన్నులు లేకుండా 2025 జూన్ వరకు వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవచ్చని ఐరోపా సమాఖ్య అనుమతి ఇచ్చింది. రష్యాను త్వరలోనే ఓడిస్తామని మా ఆర్థిక మంత్రి చెబితే నిజమే అని నమ్మాం, ఇప్పుడు అలాంటి సూచనలేమీ కనిపించటం లేదు, అదే యుద్ధం ఇప్పుడు మమ్మల్ని నాశనం చేస్తోందని ఫ్రెంచి రైతులు చెబుతున్నారు.

ఐరోపా ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను ఆధారం చేసుకొని అనేక దేశాల్లో మితవాద శక్తులు జనాల్లో ఉన్న అసంతృప్తిని సొమ్ము చేసుకుంటున్నాయి. జూన్‌లో జరిగే ఐరోపా యూనియన్ పార్లమెంటు ఎన్నికల్లో ఈ శక్తులు బలం పుంజుకుంటాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. అనేక చోట్ల స్థానిక ఎన్నికల్లో అలాంటి ధోరణి వెల్లడైంది. పోర్చుగల్ ఎన్నికల్లో చెగా అనే మితవాద పార్టీ గతంలో ఉన్న 7.2శాతం ఓట్లను 18.1కి పెంచుకుంది. స్పెయిన్ రైతుల్లో ఉన్న అసంతృప్తి కారణంగా ఓక్స్ అనే మితవాద పార్టీ గతంలో ఉన్న 24 పార్లమెంటు సీట్లను గతేడాది 33కు పెంచుకుంది. అనేక రాష్ట్రాలలో రైతుల ఓట్లు పార్టీల తలరాతలను మార్చివేస్తున్నాయి. అనేక దేశాల్లో లాటిన్ అమెరికా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కోసం ప్రధాన పార్టీలన్నీ ముందుకు వచ్చాయి. రైతుల ఆందోళన కారణంగా ఇప్పుడు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. జూన్‌లో జరిగే ఎన్నికలను గమనంలో ఉంచుకొని ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ డిసెంబరులో సంతకం చేయాల్సిన ఒక ఒప్పందాన్ని వాయిదా వేయటానికి కారణం అక్కడి రైతుల ఆందోళనే. అదే విధంగా రసాయన పురుగు మందులు, ఎరువుల వాడకంపై ఆంక్షలు విధించే బిల్లును కూడా వెనక్కు తీసుకున్నాడు. ఇలా తాత్కాలికంగా వెనక్కు తగ్గినా ఎన్నికల తరువాత ముందుకు పోతారని భావిస్తున్నారు.

ఫ్రాన్సులో రైతుల సగటు వయస్సు 50 సంవత్సరాలుగా ఉందని, అనేక కుటుంబాల్లో సాగును కొనసాగించే వారు కనిపించటం లేదని విశ్లేషణలు వెలువడ్డాయి. యాంత్రీకరణతో పనిచేసే జనాభా తగ్గి అనేక చోట్ల గ్రామాలన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. ఫ్రెంచి ఆహార, వ్యవసాయ, పర్యావరణ జాతీయ సంస్థ అధ్యయనం ప్రకారం 18శాతం మంది రైతులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు, మరో 25 శాతం మంది చావ బతకలేని స్థితిలో ఉన్నారు. పర్యావరణం పేరుతో సాగుకు ఆటంకం కలిగించటం పట్ల రైతులు ఆగ్రహం వెల్లడిస్తున్నారు. నాలుగు శాతం సాగు భూమిలో సాగు చేయకుండా చెట్ల పెంపకానికి వదలి వేయాలన్నది ఒక నిబంధన పెట్టారు. ఇతర నిబంధనల కారణంగా సబ్సిడీలకు కోత పెడుతున్నారు. ఐరోపాలో పర్యావరణ పరిరక్షణ పేరుతో ఏర్పడిన పార్టీల సమావేశాల మీద రైతులు దాడులకు దిగుతున్నారు. జర్మనీలో అదే జరిగింది. బెర్లిన్ సమపంలో రోడ్లపై ఎరువుల మడ్డిని కుమ్మరించటంతో అనేక కార్లు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా ఐరోపా దేశాల్లో ఇంధన, విద్యుత్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఫ్రాన్స్‌లో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ ఖర్చు అంతకు ముందుతో పోలిస్తే గతేడాది రెట్టింపైంది. ఎరువుల ధరలు మూడు రెట్లు పెరిగాయి. ఐరోపా వ్యవసాయ విధానమే అక్కడి రైతులను ఆందోళనలకు పురికొల్పుతున్నది. పోలాండ్‌లో కార్మికుల వేతన రేట్లు చాలా తక్కువ, దానికి తోడు చౌకగా కోళ్లను పెంచి ఇతర దేశాల మార్కెట్లలో కుమ్మరించటంతో ఫ్రాన్స్ వంటి చోట్ల కోళ్ల రైతులకు గిట్టుబాటు కావటం లేదు. ఉక్రెయిన్‌లో వేతనాలు మరీ తక్కువ. దాంతో అక్కడి నుంచి చౌక ధరలకు దిగుమతులు విపరీతంగా పెరిగాయి. అది రైతుల్లో అసంతృప్తికి దారితీయటంతో పంచదార, కోడి మాంసం దిగుమతులపై ఐరోపా సమాఖ్య కొన్ని ఆంక్షలను విధించక తప్పలేదు.

మొత్తంమీద ఒక్కో దేశంలో ఒక్కో సమస్య ముందుకు వస్తున్నది. రైతులను ఉద్యమాల్లోకి ముందుకు తెస్తున్నది.

★

ఎన్నికల బాండ్ల విషయంలో దొందూ దొందే !

- ఆ రెండు పార్టీలకు మధ్య తేడా ఏమీ లేదు !
- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

మలప్పురంలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో ప్రసంగిస్తున్న పినరయి విజయన్

మల్లప్పురం (కేరళ) : కాంగ్రెస్ చర్యలు చూస్తుంటే బిజెపిని గుర్తు తెస్తున్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం విమర్శించారు. ఎన్నికల బాండ్ల కుంభకోణంలో వెల్లడైన వివరాలు చూస్తుంటే ఈ విషయం స్పష్టమైపోతోందన్నారు. మల్లప్పురం జిల్లాలోని పతనంతిట్టలో సిపిఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ నిర్వహించిన ఎన్నికల సభలో విజయన్ ప్రసంగించారు. ఎన్నికల బాండ్ల పథకమనేది మెగా కుంభకోణమని ఆయన వ్యాఖ్యానించారు. బిజెపి ఇందులో కీలక పాత్ర పోషించిందన్నారు.

"కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పర్యవేక్షణలో చోటు చేసుకున్న ఎన్నికల బాండ్ల పథకం మెగా కుంభకోణం. బిజెపి ప్రారంభించిన ఈ పథకం కింద బాండ్ల ద్వారా పార్టీ ఏకంగా రూ.8251 కోట్లను సంపాదించింది. అయితే ఇందుకు బిజెపిని ఒక్కదాన్నే నిందిస్తే చాలదు. కాంగ్రెస్ భాగస్వామ్యం కూడా ఇందులో వుంది. ఆ పార్టీ రూ.1951 కోట్లు సంపాదించుకుంది." అని ఆయన పేర్కొన్నారు.

సిపిఎం న్యాయపోరాట ఫలితమే..

ఎన్నికల బాండ్ల విషయంలో కమ్యూనిస్టు పార్టీల వైఖరి ఆయన తన ప్రసంగంలో వివరించారు. ఈ కుంభకోణం వివరాలను బట్టబయలు చేసేందుకు సుప్రీం కోర్టులో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చేపట్టిన న్యాయ పోరాటానికే ఈ ఖ్యాతి దక్కుతుందన్నారు. ఎన్నికల బాండ్లను కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. బాండ్లు అవినీతికి మరో రూపమని ఆయన వ్యాఖ్యానించారు. పారదర్శకత ప్రాముఖ్యతను విజయన్ నొక్కి చెప్పారు. ప్రజల సమాచార హక్కుకు హామీ కల్పిస్తూ ఏచూరి ఎన్నికల బాండ్ల అంశాన్ని సుప్రీం కోర్టు ముందుకు తీసుకువచ్చారన్నారు.

బిజెపి, కాంగ్రెస్‌లు ఏ మేరకు అవినీతికి పాల్పడ్డాయో సుప్రీం తీర్పు వెల్లడించిందని విజయన్ విమర్శించారు. కాంగ్రెస్‌తో సంబంధాలు కలిగిన రియల్ ఎస్టేట్ కంపెనీ నుండి గణనీయమైన మొత్తాల్లో బిజెపికి నిధులు అందాయని విజయన్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోని బిజెపి నేతకు సంబంధమున్న కంపెనీ నుండి కాంగ్రెస్‌కు పెద్ద మొత్తంలో ఆర్థిక తోడ్పాటు లభించిందని చెప్పారు. ఇక అటువంటపుడు బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య తేడా ఏమిటి? బిజెపి ప్రయోజనాలతో కాంగ్రెస్ స్థిరంగా పొత్తు పెట్టుకుంది. కాంగ్రెస్ చేస్తున్న ఇలాంటి పనులన్నింటిలోనూ బిజెపి టచ్ వుంటోందన్నారు.

బిజెపిని గద్దె దించడమే ఈ ఎన్నికల్లో అంతిమ లక్ష్యం

- నామినేషన్ దాఖలు సందర్భంగా విజయరాఘవన్

పాలక్కడ్ కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న విజయరాఘవన్

తిరువనంతపురం : అత్యంత నిరంకుశంగా, ప్రజాకంటకంగా మారిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడమే ఈ ఎన్నికల్లో అంతిమ లక్ష్యమని సిపిఎం సీనియర్ నాయకులు, పాలక్కడ్ ఎల్‌డిఎఫ్ అభ్యర్థి ఎ విజయరాఘవన్ అన్నారు. పాలక్కడ్ లోక్‌సభ స్థానం నుంచి వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) తరపున పోటీ చేస్తున్న ఆయన మంగళవారం నాడు తన నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఆయన డమ్మీ అభ్యర్థిగా కెఎస్ సలేఖ నామినేషన్ వేశారు. ఇరువురు మూడు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 4తో గడువు ముగుస్తుంది. మిగిలిన ఎల్‌డిఎఫ్ అభ్యర్థులు బుధ, గురువారాల్లో నామినేషన్లు వేసే అవకాశముంది. ఈ నెల 5న నామినేషన్లు స్క్రూటినీ చేస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 8 వరకు గడువు ఉంటుంది.

ఈ సందర్భంగా విజయరాఘవన్ మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ఈ ఎన్నికల్లో అంతిమ లక్ష్యమని తెలిపారు. కేరళలో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడం ఇప్పుడు అత్యవసరమని ఆయన తెలిపారు. ఎల్‌డిఎఫ్‌కు పాలక్కడ్‌లో విశేష మద్దతు లభిస్తోందన్నారు. అంతకుముందు నిర్వహించిన ప్రదర్శనలో విజయరాఘవన్ వెంట సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎకె బాలన్, స్థానిక సంస్థల శాఖ మంత్రి ఎంబి రాజేష్, జిల్లా కార్యదర్శి ఇఎన్ సురేష్ బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్ఎన్ కృష్ణదాస్, కెఎస్ సలేఖ, ఎమ్మెల్యే ఎ ప్రభాకరన్, సిపిఐ జిల్లా కార్యదర్శి సురేష్ రాజ్, జెడిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మురుకదాస్ విశ్వనాథన్ పాల్గొన్నారు. అల్థూర్ నుంచి ఎల్‌డిఎఫ్ అభ్యర్థి కె రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

ఎన్నికల బాండ్ల ఎస్‌ఒపి సమాచారం ఇవ్వలేం : ఎస్‌బిఐ

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల విక్రయాలు, బాండ్లను నగదు రూపంలోకి మార్చుకోవడానికి అనుసరించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపి), పద్ధతులను వెల్లడించడానికి ఎస్‌బిఐ తిరస్కరించింది. వాణిజ్యపరమైన రహస్యాల కిందకు ఈ సమాచారం వస్తుందంటూ దాన్ని బహిర్గతం చేయడానికి నిరాకరించిందని ఆర్‌టిఐ సమాచారం తెలియచేసింది. బాండ్లకు సంబంధించి ఎస్‌బిఐ అధికారిక శాఖలకు జారీ చేసిన ఆదేశాలు, పద్ధతుల వివరాలను తెలియచేయాల్సిందిగా కోరుతూ సమాచార హక్కు చట్టం(ఆర్‌టిఐ) కార్యకర్త అంజలి భరద్వాజ్ దరఖాస్తు చేసుకోగా, సమాచారం ఇచ్చేందుకు ఎస్‌బిఐ నిరాకరించింది. 2018 నుండి ప్రతీసారీ బాండ్లకు సంబంధించి జారీ చేసిన ఆదేశాలన్నీ అంతర్గత ఆదేశాలని వాటిని కేవలం అంతర్గత పంపిణీ కోసమే ఉపయోగిస్తామని అంతేకానీ వాటిని వెల్లడించలేమని తెలిపింది. ఆర్‌టిఐ సెక్షన్ 8(1) (డి) కింద వాటికి మినహాయింపు వుంటుందని ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్, సెంట్రల్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి కన్నబనాబు చెప్పారు. దీనిపై అంజలి భరద్వాజ్ స్పందిస్తూ, ఈ పథకమే రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ అన్ని వివరాలను వెల్లడించాలని సుప్రీం ఆదేశించినప్పటికీ ఇంకా కీలక సమాచారాన్ని ఇవ్వడానికి ఎస్‌బిఐ తిరస్కరించడం దిగ్భ్రాంతి కలిగిస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.

మహువా మొయిత్రాపై ఇడి కేసు

న్యూఢిల్లీ : ముడుపులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగిన కేసుకు సంబంధించి తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రా, వ్యాపారవేత్త దర్శన్ హిరానందానీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మనీ లాండరింగ్ కేసు నమోదు చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని ఆ ఇద్దరిపై పోలీసు ఎఫ్ఐఆర్‌తో సమానమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఇసిఐఆర్)ను దాఖలు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రెండు మూడు రోజుల క్రితమే ఇడి కేసు నమోదు చేసింది. మొయిత్రా నివాసంపై గత నెల్లో సోదాలు జరిపిన సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈసారి ఎన్నికల్లో కూడా ఆమె తృణమూల్ టిక్కెట్‌పై పోటీ చేస్తున్నారు. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, ప్రధాని మోడీ ప్రభృతులపై దాడిని ఉధృతం చేసేందుకు హిరానందానీ నుండి బహుమతులు, ముడుపులు తీసుకుని బదులుగా పార్లమెంట్‌లో మొయిత్రా ప్రశ్నలు అడిగారని బిజెపి నిషికాంత్ దూబే ఆరోపించారు. ఆ ఆరోపణలపైన ప్రాథమిక విచారణ అనంతరం లోక్‌పాల్ సిబిఐకి ఆదేశాలు జారీ చేసింది.

అనంతనాగ్ నుంచి గులాం నబీ అజాద్ పోటీ

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ అజాద్ అనంత్‌నాగ్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. కాంగ్రెస్‌తో ఐదు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకొని 2022లో ఆయన డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ అజాద్ పార్టీ (డిపిఎపి) నెలకొల్పిన సంగతి విదితమే. అనంత్‌నాగ్ నుంచి అజాద్ పోటీ చేయాలని పార్టీ కీలక నేతల సమావేశంలో నిర్ణయించినట్లు డిపిఎపి నేత తాజ్ మొహియుద్దీన్ తెలిపారు. 2014లో ఉధంపూర్ – దోడా స్థానంలో బిజెపి నేత జితేంద్ర సింగ్ చేతిలో ఓడిపోయిన తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో అజాద్ పోటీ చేయడం ఇదే తొలిసారి. ఈ స్థానంలో ఇప్పటి వరకు నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ఒక్కటే తన అభ్యర్థిగా మియాన్ అల్తాఫ్‌ను బరిలో నిలుపుతున్నట్లు ప్రకటించింది. గుజ్జర్ సామాజిక తరగతిలో ఆయనకు విశేషమైన ప్రాచుర్యం ఉంది. బిజెపి కూడా ఇక్కడ నుంచి పోటీ చేయాలని భావిస్తోంది. తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా ఈ స్థానాన్ని పహారీలకు రిజర్వు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) మెహబూబా ముఫ్తీ ఇదివరకు ఈ స్థానంలో విజయం సాధించారు. అందువల్ల పిడిపి ఈ స్థానాన్ని తన కంచుకోటగా భావిస్తుంది. అయితే ఇప్పటి వరకు పిడిపి తన అభ్యర్థిని ప్రకటించలేదు. 'ఇండియా' బ్లాక్ ఎన్‌సి, పిడిపితో సీట్ల సర్దుబాటుపై సమాలోచనలు చేస్తున్నందున కాంగ్రెస్ ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశం లేదు.

సాహిత్య అకాడమీలో మితిమీరిన రాజకీయ జోక్యం

- మళయాళ రచయిత రాధాకృష్ణన్ రాజీనామా

న్యూఢిల్లీ : ప్రముఖ మళయాళ రచయిత సి.రాధాకృష్ణన్ సోమవారం సాహిత్య అకాడమీకి రాజీనామా చేశారు. సాహిత్యంలో ఏ మాత్రం ప్రవేశం లేని కేంద్ర మంత్రితో అకాడమీ ఉత్సవాలను ప్రారంభింపజేసినందుకు నిరసనగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. రాధాకృష్ణన్ తన రాజీనామా లేఖను అకాడమీ కార్యదర్శి కె శ్రీనివాసరావుకు పంపారు. సుదీర్ఘమైన, విశిష్టమైన చరిత్ర కలిగిన అకాడమీలో ఇలా జరగడం ఇదే మొదటిసారి అని ఆయన తన లేఖలో విమర్శించారు. అకాడమీ ఎన్నడూ రాజకీయ ఒత్తిడులకు లొంగలేదని, తన స్వతంత్రతను కాపాడుకుంటూనే వచ్చిందని రాధాకృష్ణన్ తెలిపారు. సంస్థ వార్షిక కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొనడాన్ని అకాడమీ సభ్యులందరూ నిరసించారని, ఇలాంటిది మరోసారి పునరావృతం కాబోదని అధికారులు ఆ తర్వాత హామీ ఇచ్చారని వివరించారు. అకాడమీ 39వ సాహిత్య ఉత్సవాలను కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రారంభించిన కొద్ది వారాలకే రాధాకృష్ణన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్సవాలకు వేలాది మంది రచయితలు హాజరయ్యారు. అకాడమీ రోజువారీ కార్యకలాపాలలో ప్రభుత్వ జోక్యం మితిమీరుతోందని రాధాకృష్ణన్ విమర్శించారు.

మోడీకి శ్రీలంకను ఖండించే దమ్ముందా?

- తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

ప్రజాశక్తి– వెల్లూరు

శ్రీలంకను ఖండించే దమ్ము ప్రధాని మోడీకి ఉందా? కచ్చతీవు దీవుల గురించి అక్కడికి వెళ్లి మాట్లాడగలరా ? అని డిఎంకె నేత , తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రశ్నించారు. మంగళవారం నాడిక్కడ జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, ఇప్పుడు భారత ప్రభుత్వం శ్రీలంకకు కచ్చతీవి ఇవ్వడంపై బిజెపి మాట్లాడటం ప్రారంభించింది. కానీ , ఇది వారికి వ్యతిరేకంగా మారింది. ఇప్పుడు కందిరీగ తుట్టెలో చేయిపెట్టిన బిజెపి అందులో ఇరుక్కుపోయి గిజగిజలాడుతోందన్నారు..2014 లో అధికారంలోకి వచ్చిన బిజెపి సుప్రీంకోర్టులో ఏం చెప్పింది ? " మేము ద్వీపాన్ని తిరిగి పొందాలనుకుంటే, మేము శ్రీలంక ప్రభుత్వంతో యుద్ధం చేయవలసి ఉంటుంది " అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ దశాబ్దంలో ప్రధాని మోదీ శ్రీలంకను ఎన్నిసార్లు సందర్శించారు ? కనీసం ఒక్కసారైనా కచ్చతీవు గురించి మాట్లాడారా?శ్రీలంక అధ్యక్షుడిని కలిసినప్పుడల్లా కచ్చతీవు భారత్‌కే చెందుతుందని చెప్పారా ? ఆ సమయంలో మోడీకి కచ్చతీవు గుర్తుకు రాలేదు. నెహ్రూ హయాంలో – ఇందిరా కాలంలో జరిగినవన్నీ గుర్తున్న మోడీకి రెండేళ్ల క్రితం జరిగిన సంఘటన గుర్తుకు రావడం లేదా? అని ప్రశ్నించారు.

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ కొందరు ' పార్ట్ టైమ్ ' రాజకీయ నాయకులు తమిళనాడుకు వస్తున్నారు. 'నేనెవరో మీకు తెలుసు. ప్రధాని మోడీ ఎలాంటి వారో మీకు తెలుసు. ఎన్నికల సీజన్‌లో మాత్రం రాష్ట్రంలో పర్యటనలు జరుపుతారు. అబద్ధాలు , దూషణలు, విద్వేషాలను ప్రసంగం నిండా దట్టిస్తారు. రాష్ట్రంలో వరదలొస్తే ఇటువైపు తొంగిచూడరు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులు అడిగితే ఇవ్వరు. రాష్ట్ర ప్రజలను మోసం చేసినవారు ఇప్పుడు తమిళనాడును ఉద్ధరిస్తామంటూ ముందుకొస్తున్నారు. ఇటువంటి పార్ట్‌టైమ్ రాజకీయ నాయకులను ఉపేక్షించకండి' అని ఓటర్లకు స్టాలిన్ విజ్ఞప్తి చేశారు.

ఇండియా బ్లాక్ కు మీరు ఇచ్చే ప్రతి ఓటు తమిళనాడును మరింత విజయవంతమైన మార్గంలో తీసుకెళ్తుంది . తమిళనాడును ద్వేషించే ప్రధాని మోడీకి బదులు , ఇండియా వేదిక తరపున ప్రధానమంత్రి కాబోతున్న వ్యక్తి తమిళనాడు అభివద్ధికి కచ్చితంగా సహకరిస్తారని ఆయన అన్నారు. తాము సాధించిన విజయాలు పదేళ్ల అన్నాడీఎంకే పాలనలోని చీకట్లను తొలగించి తమిళనాడులో వెలుగులు నింపాయని అన్నారు.

అన్నాడీఎంకె అధికారంలో ఉన్నప్పుడు పళనిస్వామి మైనారిటీ ప్రజలను వెన్నుపోటు పొడిచారు. ఇప్పుడు భాజపాతో బూటకపు పొత్తు పెట్టుకుని మైనార్టీలను పట్టించుకున్నట్లు నటించడం మొదలుపెట్టారు.

గత ఐదేళ్లలో అన్నాడిఎంకె ఎంపీలు ఏం చేశారు ? కేంద్రప్రభుత్వం ప్రజావ్యతిరేక చట్టాలు తెచ్చినప్పుడు వాటికి మద్దతు పలికారు. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చినప్పుడు వాటికి వ్యతిరేకంగా తాము పార్లమెంటు లోపలా , బయటా తామే పోరాడామని అన్నారు.

గాజాలో ఇజ్రాయిల్ పైశాచికం

- ఆహారం పంపిణీ చేస్తున్న సంస్థపైనా దాడులు
- వరల్డ్ సెంట్రల్ కిచెన్‌కు చెందిన ఏడుగురు మృతి
- తీవ్రంగా ఖండించిన అంతర్జాతీయ సమాజం

గాజా : ఇజ్రాయిల్ దురాగతాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తాజాగా గాజాలో ఆహార సరఫరాల పంపిణీ జరుపుతున్న వరల్డ్ సెంట్రల్ కిచెన్ సిబ్బందిపై దాడులకు దిగింది. ఇజ్రాయిల్ మిలటరీ లక్ష్యిత దాడిలో తమ సిబ్బంది ఏడుగురు మరణించారని వరల్డ్ సెంట్రల్ కిచెన్ ధృవీకరించింది. తక్షణమే గాజాలో విచక్షణారహితంగా జరుగుతున్న కాల్పులను ఆపాల్సిందిగా అమెరికా కేంద్రంగా పనిచేసే ఈ సహాయ గ్రూపు కోరింది. మరణించిన వారిలో పాలస్తీనా, ఆస్ట్రేలియా, పోలెండ్, బ్రిటన్, అమెరికా–కెనడా పౌరుడు వున్నారు. కాగా, ఇజ్రాయిల్ అమానవీయ దాడులను అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఖండించింది. నెతన్యాహూ యుద్ధోన్మాదం మితిమీరిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఆహారాన్ని అందకుండా చేయడాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకోవడం ఇజ్రాయిల్ దాష్టీకానికి అద్దం పడుతోందని పలువురు విమర్శించారు.

గాజాలో చోటు చేసుకున్న దాడి తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని చైనా పేర్కొంది. గాజా ప్రజలకు అవసరమైన ఆహార సరఫరాలు అందించడానికి వచ్చిన బృందం ఇలా దారుణంగా దాడికి దిగి వారిని పొట్టనబెట్టుకోవడాన్ని తీవ్రంగా ఖండించింది. పౌరులకు హాని చేకూర్చే, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించే ఇలాంటి చర్యలన్నింటినీ చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ పేర్కొన్నారు. ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ఇలాంటి చర్యలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని చైనా పేర్కొంది. ఇరాన్ ఎంబసీపై దాడిని ఖండించింది. ఇలాంటి దారుణాలను తాము ఎంతమాత్రమూ సహించబోమని రష్యా స్పష్టం చేసింది. ఇజ్రాయిల్ ఇలాంటి దారుణాలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేసింది. హైతీలో ఘోరమైన భూకంపం సంభవించిన నేపథ్యంలో 2010లో సెలబ్రిటీ చెఫ్ జోస్ ఆండ్రెస్ ఈ వరల్డ్ సెంట్రల్ కిచెన్‌ను ప్రారంభించారు. గాజాలో జరిగిన దారుణాన్ని చూసి తన హృదయం ద్రవించిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయిల్ దాడిలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియచేశారు. మరణించిన వరల్డ్ సెంట్రల్ కిచెన్ సిబ్బంది మృత దేహాలను రాఫా క్రాసింగ్ ద్వారా తరలించడానికి ఏర్పాట్లు చేసినట్లు పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీ తెలిపింది. తొలుత అల్ అక్సా ఆస్పత్రికి తరలించి, అక్కడ నుండి రాఫాలోని అల్ నాజర్ ఆస్పత్రికి తరలించనున్నారు. తాజా మరణాలతో గాజాలో ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 32,916కి చేరింది. 75,94మంది గాయపడ్డారు. కాగా గాజాలో ప్రజలకు ఎంతగానో అవసరమైన ఆహార సరఫరాలు అందనీయకుండా ఇజ్రాయిల్ ప్రతిచోటా ఆహార సరఫరాలపై ఆంక్షలు విధిస్తోందని సేవ్ ది చిల్డ్రన్ చారిటీ విమర్శించింది. ప్రాణాధారమైన ఆహారం, మందులు కూడా సకాలంలో అందనీయకుండా సుదీర్ఘ జాప్యం జరిగేలా చూస్తోందని ఒక ప్రకటనలో విమర్శించింది.

ఐరాస భద్రతా మండలి భేటీ

సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ ఎంబసీపై ఇజ్రాయిల్ దాడి నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసరంగా సమావేశమవనుంది. రష్యా అభ్యర్థన మేరకు భద్రతా మండలి సమావేశమై ఇజ్రాయిల్ దారుణాన్ని చర్చించనుంది. ఈ మేరకు రష్యా డిప్యూటీ రాయబారి దిమిత్రి పొలియెన్స్కి ఒక ప్రకటన చేశారు. సిరియాలోని ఇరాన్ రాయబార కార్యాలయంపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు సోమవారం దాడి చేసిన సంగతి విదితమే. ఈ దాడిలో సీనియర్ మిలటరీ కమాండర్లతో సహా తమ సైనిక సలహాదారులు ఏడుగురు సహా మొత్తంగా 13మంది మరణించారు.

ఏప్రిల్ 19న మన ఓటు మోడీపై వేటు కావాలి

- మంత్రి ఉదయనిధి ప్రసంగం!

చెన్నై: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఫాసిజాన్ని ఓడించాలని, రాష్ట్ర హక్కులను కాపాడాలని మార్చి 23 నుంచి ప్రచారం చేస్తున్న డీఎంకే యువజన కార్యదర్శి, క్రీడాభివద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఏప్రిల్ 2న కొలత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని బందా థియేటర్‌లో ఉత్తర చెన్నై లోక్‌సభ అభ్యర్థి కళానిధి వీరాసామికి మద్దతు తెలిపారు. .. ఆయన దగ్గరి నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు.

ఆ సమయంలో, కోవిడ్ వ్యాప్తి, భారీ వర్షాలు మరియు వరదల సమయంలో తమిళనాడుకు వెళ్లని ప్రధాని మోడీ ఇప్పుడు తరచూ పర్యటిస్తున్నారు. ఎన్నిసార్లు వచ్చినా తమిళనాడు ప్రజలు మోసపోరు.

ముఖ్యమంత్రి ఎడప్పాడి తన పాలనను కాపాడుకోవడానికి శశికళ కాళ్లపై పడి మూల్యం చెల్లించుకున్నారు. కేంద్ర భాజపా ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాల హక్కులను తాకట్టు పెట్టాడు.

ఎఐఎడిఎంకె మంత్రులపై సిబిఐ దాడులు, ఐటి రైడ్ వంటి అనేక కేసులు నమోదయ్యాయి మరియు వారు బిజెపి నియంత్రణలో వారిని బానిసలుగా ఉంచారు. ఫలితంగా, వారు %జూలూ%కి అనుకూలంగా ఓటు వేశారు. తమిళనాడు ప్రజలు ఇవన్నీ మరిచిపోలేదని, గత ఎన్నికల్లో కలిసి పోరాడిన మన శత్రువులు ఇప్పుడు విడిపోయినా కలిసి వస్తున్నారన్నారు. కాబట్టి, విజయం మాకు సులభం అని అనుకోకండి. తమిళనాడును మోసం చేస్తున్న మోడీ, ఎడప్పాడి కూటములకు గుణపాఠం చెప్పేందుకు ఏప్రిల్ 19న మనం వేసే ఓటు మోడీపై వేటు పడుతుందని కూడా ఉదయనిధి అన్నారు.

బిజెపిలో చేరకుంటే అరెస్టులేనట !

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ 4న ఎంపి సంజయ్ సింగ్‌ను ఇడి అరెస్ట్ చేసింది. ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆరోగ్య శాఖ మంత్రి సత్యేంద్ర జైన్, బిఆర్ఎస్ సేత కవిత తీహార్ జైలులో ఉన్నారు.

ఇడి ప్రతీకార చర్య : సింఘ్వీ

లిక్కర్ స్కాంలో సంజయ్ సింగ్ పై ఇడి చేస్తోన్న ఆరోపణలు మొత్తం అప్రూవర్ గా మారిన దినేశ్ అరోరా స్టేట్మెంట్ తో ముడిపడి ఉన్నాయని సింఘ్వీ కోర్టు కు నివేదించారు. అరోరా ముందు ఇచ్చిన 9 వాంగ్మూలాలలో సంజయ్ సింగ్ పేరు లేదని, తరువాత ఆయన పేరు చేర్చినట్లు చెప్పారు. అనంతరం ఇడి 'నో అబ్జక్షన్' స్టేట్మెంట్ తో అప్రూవర్ గా మారిన దినేశ్ అరోరాకు బెయిల్ వచ్చిందని అన్నారు.. అయితే సెక్షన్ 50 ప్రకారం అరోరా స్టేట్మెంట్ పై తమకు అభ్యంతరం లేదన్నారు. కానీ సంజయ్ సింగ్ అరెస్ట్ జరిగిన రోజు నిర్వహించిన ప్రెస్ మీట్ తరువాత, ఇడి ప్రతీకార చర్యలు చేపట్టిందని ఆరోపించారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం, సంజయ్ సింగ్ నుంచి ఎలాంటి డబ్బు రికవరీ కానందున తదుపరి కస్టడీ అవసరమా? లేదా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని ఎఎస్జి ఎస్వీ రాజునుకోరింది. ఇడి నుంచి అభ్యంతరం లేకపోవడంతో బెయిలు మంజూరు చేసింది.

ఈరోజు కోసం ఎదురుచూస్తున్నాం : సంజయ్ సింగ్ తల్లి రాధికా సింగ్

మద్యం పాలసీ కేసులో ఆప్ నేత సంజయ్ సింగ్‌కు బెయిల్ మంజూరు చేయడంపై ఆయన తల్లి రాధికా సింగ్ స్పందించారు. కోర్టు నిర్ణయంతో తాము సంతోషంగా ఉన్నామని, దీని కోసం తాము ఎప్పటినుంచో వేచి చూస్తున్నామని చెప్పారు. తన కుమారుడు అమాయకుడని, ఆయనను అరెస్ట్ చేయకూడదని, అయినా తనకు బెయిల్ రావడంతో తాము సంతోషంగా ఉన్నామని పేర్కొంది. ఇక సంజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని ఆప్ స్వాగతించింది. సత్యం గెలిచిందని ఆప్ జాతీయ ప్రతినిధి ప్రియాంక కక్కర్ పేర్కొన్నారు. తాము మొదటి నుంచి ఇదే చెబుతున్నామని, ఈ కేసు మొత్తం బూటకమని, బిజెపి కార్యాలయంలో ఈ కేసుపై కట్టుకథ అల్లారని ఆమె విమర్శించారు. మరో 500 సార్లు దాడులు చేసినా ఒక్క పైసా కూడా స్వాధీనం చేసుకోలేరని అన్నారు. విచారణలో డబ్బు దొరకనప్పుడు ఆయనను ఎందుకు కస్టడీలో ఉంచాలని సుప్రీంకోర్టుప్రశ్నించిందని కూడా ప్రియాంక కక్కర్ పేర్కొన్నారు.

తప్పుడు ప్రకటనలపై తలొంచిన రాందేవ్ బాబా

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేసింది. సరైన సమాచారంతో అఫిడవిట్లు సమర్పించాలని, మరోమారు రాందేవ్, బాలకృష్ణ వ్యక్తిగతంగా హాజరుకావాల్సివుంటుందని నిర్దేశించింది.

ప్రజలను తప్పుదారి పట్టించే వాణిజ్య ప్రకటన కేసులో సక్రమంగా అఫిడవిట్లు దాఖలు చేయకుండా ఇచ్చిన హామీలను ఉల్లంఘించారని కోర్టు విమర్శించింది. డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ (మ్యాజిక్ రెమిడీస్) చట్టం చాలా ప్రాచీనమైనదని పతంజలి ఎండి చేసిన ప్రకటనతో కోర్టు విభేదించింది. కేవలం సుప్రీం కోర్టనే కాదని, దేశవ్యాప్తంగా ఏ న్యాయస్థానమైనా జారీ చేసే ప్రతి ఆదేశాన్నీ గౌరవించాల్సిందేనని జస్టిస్ హిమా కొహ్లి, జస్టిస్ అసదుద్దీన్ అమనుల్లా లతో కూడిన బెంచ్ స్పష్టం చేసింది. ఈ కేసులో ఇది సంపూర్ణమైన ఉల్లంఘనే అని పేర్కొంది. న్యాయస్థానానికి మీరిచ్చిన హామీకి కట్టుబడి వుండాలి, కానీ మీరు ప్రతి చోటా ఉల్లంఘిస్తూనే వచ్చారని బెంచ్ పేర్కొంది. బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసే సమయంలో కోర్టు రూమ్‌లో రాందేవ్, పతంజలి ఎండి వున్నారు. కోవిడ్‌కు అల్లోపతిలో చికిత్సే లేదని చెబుతుంటే కేంద్రం కళ్ళు మూసుకుని ఎలా కూర్చుందని సుప్రీం విస్మయం వ్యక్తం చేసింది. రాందేవ్ తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది బల్బీర్ సింగ్ మాట్లాడుతూ, యోగా గురు కోర్టుకు హాజరు కావడాన్ని, ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఏదైతే జరిగిందో అది మరోసారి జరగబోదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు చెప్పారు. కావాలంటే ఈ సమస్యకు ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి అవసమైతే సంబంధిత పక్షాల న్యాయవాదులకు సాయం చేస్తానని ముందుకొచ్చారు. ముందుగా మీరిచ్చిన హామీలకు అనుగుణంగా అఫిడవిట్లు దాఖలు చేయాలని బాలకృష్ణ తరపు న్యాయవాదికి జస్టిస్ కొ హ్లి చెప్పారు. రాందేవ్‌కు చివరి అవకాశంగా అఫిడవిట్లు దాఖలు చేసేందుకు మరో వారం గడువు ఇచ్చింది. తిరిగి ఏప్రిల్ 10న తదుపరి విచారణకు వాయిదా వేసింది.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor, Door No. 31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

O.A. No. 977 of 2023

BETWEEN:
Union Bank of India, Ajith Singh Nagar Branch, Represented by its Senior Manager, Krishna District ... **Applicant**
AND :
Jaganmohan Rao Nuthalapathi & Others ... **Defendants**

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To
1 : Jaganmohan Rao Nuthalapati, S/o. Venkateswara Rao Nuthalapati, D.No. 4-194, Ganganamma Temple Road, Gollapudi, Krishna Dt., A.P. - 521225
And also at : Mr. Jaganmohan Rao Nuthalapati, S/o. Venkateswara Rao Nuthalapati, Flat No. 9, 4th Floor, Bharathi Residency, Nearest D.No. 4-135, Ganganamma Temple Road, Gollapudi, Krishna Dt., AP - 521225
2 : Mrs. Kalyani Nuthalapati, W/o. Venkateswara Rao, D.No. 4-194, Ganganamma Temple Road, Gollapudi, Krishna Dt., A.P. - 521225

1) Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you (Defendants 1 to 3) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m, or at such time immediately thereafter according to the convenience of Tribunal **on 03-05-2024** to answered the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents, you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determine in your absence.
Given under my hand and seal of the Tribunal on this the 1st day of April, 2024 at Visakhapatnam.

Signature of the Officer Authorised
Debts Recovery Tribunal
Visakhapatnam

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor, Door No. 31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

O.A. No. 979 of 2023

BETWEEN:
Union Bank of India, Erstwhile Andhra Bank, Gannavaram Branch, Krishna District., Represented by its Chief Manager ... **Applicant**
AND :
Mrs. Potluri Sunitha & 2 others ... **Defendants**

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

To
1 : Mrs. Potluri Sunitha, W/o. P.V.Ramana Rao, D.No. 1-4, Kothapalli Village, Bapulapadu Mandal, Krishna District.
And Also at :
Mrs. Potluri Sunitha, Flat No. JA-3, Ground Floor, Jithri Block of Sri Raams Golden Nest, Chinnavutapalli, Gannavaram (V & M), Krishna District - 521101
2) Mr. Potluri Venkata Ramana Rao, S/o. Manidattu, D.No. 1-4, Kothapalli Village, Bapulapadu Mandal, Krishna District.
3) Mr. Potluri Manidattu, S/o. Veeriah, D.No. 1-4, Kothapalli Village, Bapulapadu Mandal, Krishna District.

1) Whereas the applicant has instituted an application under section 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 against you (Defendants 1 to 3) for recovery of sum of mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 a.m, or at such time immediately thereafter according to the convenience of Tribunal **on 16-04-2024** to answered the claim.
2. You are directed to collect the annexure on your appearance before the Tribunal.
3. If you intended to file any documents, you may file the same with a list along with the written statement.
4. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.
5. Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceedings will be heard and determine in your absence.
Given under my hand and seal of the Tribunal on this the 1st day of April, 2024 at Visakhapatnam.

Signature of the Officer Authorised
Debts Recovery Tribunal
Visakhapatnam

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
కన్నావారితోట బ్రాంచి : 96-1-95 మెయిన్ రోడ్డు, నగరంపాలెం, కన్నావారితోట, గుంటూరు, -522004

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6 (2) / RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు / కో–అప్లికెంట్స్ / తనఖాదారులు/ హామీదారులు : 1) శ్రీ రామిశెట్టి శ్రీనివాసరావు, తండ్రి : రామిశెట్టి జగన్నాధరావు, డోర్ నెం. 08-12-02, కొండలరావుపేట, నర్సరావుపేట, గుంటూరు జిల్లా – 522601. **2) శ్రీ రామిశెట్టి సుబ్బారావు,** డోర్ నెం. 08-12-02, కొండలరావుపేట, నర్సరావుపేట, గుంటూరు జిల్లా – 522601.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, (యాక్టు 54 యొక్క 2002) ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కన్నావారితోట బ్రాంచి వారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 15-09-2023** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 25-01-2024**న అధీకృత అధికారి స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **కన్నావారితోట బ్రాంచి** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ–వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. పైన తెలిపిన ఆస్తికి **రిజర్వు ధర రూ. 28,52,000/- (అక్షరాలా ఇరవై ఎనిమిది లక్షల యాభై రెండు వేల రూపాయలు మాత్రమే)** విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది.

కాబట్టి, ఆస్తుల లావాదేవీలు చేస్తున్న లేదా ఇతరాత్ర ఇట్టి ఆస్తులు కొనుగోలు పట్ల ఆసక్తి గల వ్యక్తులు నుండి కొటేషన్లు పొందుట లేదా (బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా (సి) బహిరంగ వేలం నిర్వహించుట ద్వారా లేదా (డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా బ్యాంక్ ఆమోదయోగ్యమైన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు. విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ–వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ–వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 15-09-2023** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించిగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. (చట్టంలోని సెక్షన్ 13 (8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

నర్సరావుపేట మున్సిపల్ లిమిట్స్ ఏరియా, ప్రకాశ్ నగర్, కంభంపాలెం, పాత వార్డు నెం. 4, కొత్త వార్డు నెం. 12, టి.ఎస్.నెం. 1521, 1522/1, 1522 వద్ద ఎకరా 2.22 సెంట్లు మరియు డి.నెం. 322/డి, 323/బిఎ, 322/ఎ వద్ద ఎకరా 8.49 సెంట్ల స్థలము దానికి చెందిన డోర్ నెం. 12-22-2/21, 12-22-3, 12-22-3/2, 12-3-51, వద్ద 2034.65 చ॥గ॥ల విస్తీర్ణంలోని స్థలము దానికి చెందిన పాత మున్సిపల్ అసిస్‌మెంట్ నెం. 815, కొత్త మున్సిపల్ అసిస్‌మెంట్ నెం. 1024010025, **హద్దులు : తూర్పు :** శారదాంబ థియేటర్ ఆస్తి మరియు మిరియాల వెంకటేశ్వర్లు గారి కుమారుల ఆస్తి, **దక్షిణం :** 40 అ॥ వెడల్పు మున్సిపల్ బజారు, **పడమర :** మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం :** దావల శవమ్మ మరియు ఇతరుల ఆస్తి, **మరలా తూర్పు :** సాయి సుధ కన్‌స్ట్రక్షన్‌కి చెందిన బఫర్ జోన్, **మరలా ఉత్తరం :** సాయి సుధ కన్‌స్ట్రక్షన్‌కి చెందిన బఫర్ జోన్, శ్రీ రామిశెట్టి శ్రీనివాసరావు కి గారికి చెందిన స్థలము అవిభక్త మరియు పేర్కొనబడని వాటా 48.08 చ॥గ॥లు లేదా 40.38 చ॥మీ॥ల స్థలము అందలి 2 చ॥గ॥లు స్థలము కార్ పార్కింగ్ "సిరి ఎస్టేట్స్" అపార్టుమెంట్ నందు ప్లింత్ ఏరియా 1160.98 చ॥అ॥లు (అసలు ప్లాట్‌కి ప్లింత్ ఏరియా), 1525.00 చ॥అ॥లు (డాక్యుమెంట్స్ ప్రకారం ప్లాట్‌కి కామన్ ఏరియా) తో ఫస్ట్ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెం. 206. **ఫ్లాట్‌కి హద్దులు : తూర్పు :** గ్రౌండ్‌కి ఓపెన్ ఏరియా (అపార్ట్‌మెంట్‌కి శూన్యాకాశము), **దక్షిణం :** గ్రౌండ్‌కి ఓపెన్ ఏరియా (అపార్ట్‌మెంట్‌కి శూన్యాకాశము – 40 అ॥ రోడ్డు), **పడమర :** ఈ ఫ్లాట్‌కి & ఫ్లాట్ నెం. 205కి గ్రౌండ్‌కి ఓపెన్ ఏరియా, **ఉత్తరం :** కామన్ కారిడార్ (ఈ ఫ్లాట్ 206కి మరియు ఫ్లాట్ నెం. 207కి మధ్య)

తేది : 11-03-2024
ప్రదేశం : గుంటూరు

సం/– అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మీ కోసం

నెయ్యిలో ఉండే ఔషధ గుణాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. మన శరీరానికి అవసరమైన విటమిన్-ఎ, విటమిన్-ఇ, విటమిన్-కె వంటి ప్రొటీన్స్, కొవ్వును కరిగించే విటమిన్లు పుష్కలంగా నెయ్యిలో ఉన్నాయి.

జీవన సౌరభం

ఏదైనా సాధించాలనే సంకల్పం ఉంటే సరిపోదు. దానికి కచ్చితమైన ఆచరణ, సాధించగలమనే ఆత్మవిశ్వాసం ఉండాలి.

కరుణ

కార్తికేయ తన తండ్రితో కలిసి బజారుకు బయలు దేరాడు. తండ్రి చెయ్యి పట్టుకుని నడుస్తున్న కార్తికేయకు రోడ్డు మీద ఒక సంఘటన ఆశ్చర్యానికి గురిచేసింది. ఒక చిన్న కుక్కపిల్ల రోడ్డు మీద పడివున్న ప్లాస్టిక్ కవరును నోట కరుచుకుని వస్తోంది. పాపం అది కవరును రోడ్డు పక్కకు తెచ్చి దాని ముడిని నోటితో విప్పటానికి విశ్వప్రయత్నం చేస్తోంది. కానీ దాని వల్ల కావటం లేదు. కుక్కపిల్లను చూసిన కార్తికేయకు జాలి కలిగింది. దాని డొక్కలు లోపలికి పోయాయి. బాగా ఆకలి మీద ఉన్నట్లుంది. కాలి కింద కవరును పెట్టి నోటితో ముడి విప్పాలని ప్రయత్నిస్తోంది. కార్తికేయ తండ్రిని ఆపి కుక్కపిల్లను చూపించాడు. కుక్క పిల్ల దృష్టి అంతా కవరు ముడి మీదే ఉంది. ఎంత ప్రయత్నం చేసినా అది ముడి విప్పలేక పోతోంది.

దాని అవస్థ చూసిన కార్తికేయ తండ్రితో "నువ్వు కవరు ముడి విప్పకూడదా!" అన్నాడు. అందుకు తండ్రి "మనం దగ్గరకు వెళ్తే కరుస్తుందేమో!" అన్నాడు. "లేదు నాన్నా! అది చిన్న కుక్కపిల్లేగా... మెల్లగా దగ్గరకు వెళ్లి కవరు ముడి విప్పుదాం" అన్నాడు కార్తికేయ.

ఇంతలో కార్తికేయకు కుక్క పిల్ల కరవకుండా ఒక ఆలోచన వచ్చింది. "నాన్నా! నా జేబులో బిస్కట్లు ఉన్నాయి. వాటిని కుక్కపిల్ల ముందు వేస్తాను. అది బిస్కట్లు తింటుంటే నువ్వు కవరు ముడి విప్పొచ్చు" అన్నాడు. ఆ ఆలోచన బాగుంది అన్నాడు తండ్రి.

కార్తికేయ తన జేబులో వున్న బిస్కట్లను కుక్కపిల్ల ముందు వేయగా, అది తినటం ప్రారంభించింది. అదే సమయంలో కార్తికేయ తండ్రి కవరు ముడి విప్పదీశాడు. అందులో రొట్టె ముక్క కనపడింది. రొట్టెను కుక్కపిల్లకు కనపడేలా కవరు మీద పెట్టాడు. బిస్కట్లు తిన్న కుక్కపిల్లకు రొట్టె కనపడగానే గబగబా తినటం ప్రారంభించింది. కుక్కపిల్ల రొట్టె తినటంతో కార్తికేయ మనస్సు ఆనందంతో నిండిపోయింది. తండ్రి కార్తికేయను ప్రేమతో దగ్గరకు తీసుకున్నాడు.

- తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర,
94923 09100

చుక్కలు కలపండి

చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ

- జి.హాసినిరెడ్డి,
రెండో తరగతి
అరవింద హైస్కూలు, కుంచనపల్లి

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అవసరమైన శిశువులకు అమ్మ పాలు

అమ్మ పాలను అమృతంతో పోలుస్తారు. నవజాత శిశువులకు అప్పటికప్పుడు పోషకాహారంగా ఉపయోగపడడం ఒక్కటే కాదు; భవిష్యత్తులో ఆరోగ్యంగా ఎదగటానికీ అమ్మపాలు ఎంతగానో దోహదపడతాయి. అయితే, నవీన కాలంలో అనేక కారణాల వల్ల కొంతమంది తల్లులకు అసలు పాలు పడకపోవడమో లేక బిడ్డకు అవసరమైనన్ని పాలు లభ్యం కాకపోవడమో జరుగుతోంది. కొంతమంది తల్లులకేమో తమ బిడ్డకు సరిపోగా, ఇంకా ఎంతో మోతాదులో పాలు మిగిలిపోతాయి. ఈ రెండు పరిస్థితులను సమన్వయం చేస్తూ, కొన్ని దేశాల్లో మదర్ మిల్క్ బ్యాంకులు ఏర్పాటు అయ్యాయి. మన రాష్ట్రంలోనూ ఇప్పుడు అలాంటి మంచి ప్రయత్నం జరుగుతోంది.

రాయలసీమకే తలమానికంగా నిలుస్తున్న తిరుపతి ప్రసూతి వైద్యశాలలో ఇకపై ముర్రుపాలు లభ్యం కానున్నాయి. నెలలు నిండకముందే తక్కువ బరువుతో జన్మించి, తల్లికి దూరంగా ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందే శిశువుల పాలిట మదర్ మిల్క్ బ్యాంకు కల్పతరువుగా మారనుంది. ఆస్పత్రిలో ప్రసవించి పాలు సమృద్ధిగా ఉన్న తల్లుల నుంచి ముర్రుపాలు సేకరించి, ఆకలితో బాధపడుతున్న శిశువులకు సరఫరా చేసేందుకు తిరుపతి ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాట్లు చేశారు.

తిరుపతి రోటరీ క్లబ్ వారి ఆర్థిక సహకారంతో, రూ.30 లక్షల వ్యయంతో తిరుపతి ప్రసూతి ఆస్పత్రిలో నవజాత శిశువుల ఆరోగ్య కేంద్రంలో మదర్స్ మిల్క్ బ్యాంకును నెలకొల్పారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఈ సేవలు అందుబాట్లోకి రానున్నాయి. ఈ ఆస్పత్రిలో నెలకు 600 నుంచి 750 మంది శిశువులు చికిత్స పొందుతుంటారు. వీరిలో 30 శాతం మంది నెలలు నిండకముందు, తక్కువ బరువుతో జన్మించిన వారే ఉంటున్నారు. వీరిలో చాలా మంది రోజుల తరబడి తల్లికి దూరంగా చికిత్స పొందుతుంటారు. ఇలా తల్లికి దూరంగా ఉన్న, వైద్యులు సిఫార్సు చేసిన 1.5 కేజీల లోపు శిశువులకు మదర్స్ మిల్క్ బ్యాంకు ముర్రు పాలు సరఫరా చేస్తుంది. ఇలా నెలకు సగటున 300 మంది పిల్లల ఆకలి తీర్చటానికి మదర్ మిల్క్ బ్యాంకు ఉపయోగపడుతుందని తిరుపతి ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు.

ముర్రుపాలే శ్రేష్టం

ఈ ఆస్పత్రిలో రోజుకు 20 నుంచి 25 ప్రసవాలు జరుగుతాయి. కొంతమంది బాలింతలకు ప్రసవం తర్వాత రెండు మూడురోజుల వరకు పాలు పడటం లేదు. పాలు పడని తల్లులే కాకుండా పాలు సమృద్ధిగా లభించే తల్లుల పాలిట ఈ కేంద్రం ఓ వరంగా మారింది. పాలు పడని తల్లులకు

కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందజేస్తుంది. తల్లి వద్ద సమృద్ధిగా పాలు ఉన్నప్పటికీ.. శిశువు అనారోగ్యంతో బాధపడుతుండటంతో తాత్కాలికంగా ఫీడింగ్ నిలిపి వేయాల్సి ఉంటుంది. ఇలాంటి వారంతా స్వచ్ఛందంగా తల్లిపాల నిధికి చేరుకుని తమ పాలను దానం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల భవిష్యత్తులో వీరు రొమ్ము కేన్సర్ బారి నుంచి బయటపడే అవకాశం ఉంది. ఇలా 300 మంది పిల్లలకు సరిపడా పాలను నిల్వ చేసే సౌలభ్యం ఉన్నట్లు తెలుస్తోంది.

అత్యంత భద్రంగా నిల్వ

పాల సేకరణకు ముందే వీరికి హెచ్ఐవీ, వీడీఆర్ఎల్, హెచ్ఎస్‌బీసీ వంటి వైద్య పరీక్షలు చేసి, ఎలాంటి వ్యాధులు లేవని నిర్ధారించుకున్న తర్వాతే పాలను సేకరిస్తారు. ఇలా వీరి నుంచి సేకరించిన పాలను ప్రాసెస్ చేసి మైనస్ 20 డిగ్రీల వద్ద భద్రపరుస్తారు. వీటిని ఆరు మాసాల వరకు వాడుకునే అవకాశం ఉంది. తల్లిపాలలో రోగనిరోధక శక్తిని పెంపొందించే ప్రొటీన్లతో పాటు శారీరక, మానసిక, ఆరోగ్య వికాసానికి అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. 100 గ్రాముల తల్లిపాలలో 65 కిలో కేలరీల శక్తినిస్తాయి. ఇందులో విటమిన్ ఎ సహా థయామిన్, రైబోఫ్లెవిన్, బి12, బి6, సెనథోనిక్ ఆమ్లం, బయో టిక్, ఫోలిక్ ఆమ్లం, సీ,డీ,ఇ విటమిన్లు, క్యాల్షియం, ఇనుము, మెగ్నీషియం, వంటి ఖనిజ లవణాలు లభిస్తాయి. బిడ్డకు రోజుకు కనీసం 8 నుంచి 10 సార్లు పాలు తాగించాల్సి ఉంది. ఇలా కనీసం ఆరు మాసాల పాటు తల్లి పాలే అందించాలి.

తిరుపతి ప్రసూతి ఆసుపత్రిలో మదర్ మిల్క్ బ్యాంకు సేవలు ప్రారంభించటం చాలా అభినందనీయం. ఇలాంటి ప్రయత్నం వీలైనన్ని అన్ని చోట్లా జరగాలి. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి, సేవాదృక్పథం పెంపొందించటానికి అమ్మ పాలు వితరణ చాలా గొప్ప ప్రయత్నం.

- మారేడుపల్లి రాధాక్రిష్ణ
ప్రజాశక్తి విలేకరి, తిరుపతి

తల్లులు దాతృత్వం చాటుకోవాలి

పిల్లలకు ముర్రుపాలకన్నా శ్రేష్టమైనవి ఇంకేమీ లేవు. వైద్యరంగంలో రాయలసీమకే తలమానికంగా నిలుస్తున్న తిరుపతి ప్రసూతి ఆస్పత్రిలో 20 శాతం మేరకు బరువు తక్కువ, నెలల తక్కువతో జన్మించే పిల్లలు ఉన్నారు. వీరు 1200 గ్రాముల కంటే తక్కువ బరువు ఉన్నప్పుడు సర్వైవ్ అయ్యే అవకాశం తక్కువ ఉంటుంది. ఈ పరిస్థితుల్లో తిరుపతి రోటరీక్లబ్ వారు ముందుకొచ్చి మదర్ మిల్క్ బ్యాంకును ఏర్పాటు చేయడం శుభ పరిణామం. తల్లిపాల ఆవశ్యకతపై ఆసుపత్రిలో ప్రసవించిన వారందరికీ అవగాహన కల్పిస్తున్నాం. తల్లులూ దాతృత్వం చాటుకుని పాలను మిల్క్ బ్యాంకు ఇచ్చేలా చొరవ తీసుకుంటున్నాం. తప్పకుండా ఈ మిల్క్‌బ్యాంకు విజయవంతం అవుతుందని భావిస్తున్నాం.

- డాక్టర్ పార్థసారథి, సూపరింటెండెంట్
ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, తిరుపతి

కోడిగుడ్డులో పోషకాలు మెండు

కోడిగుడ్డులోని ప్రొటీన్ శరీరానికి శక్తిని అందించటమే కాకుండా కంటి చూపు మెరుగ్గా ఉంచేందుకు దోహదపడుతుంది. ప్రతిరోజూ గుడ్డు తినేవారిలో కంటి సమస్యలు తక్కువగా వస్తాయి. కంటిచూపు మందగించటం వంటి సమస్యలను అధిగమించేలా గుడ్డులో ఉండే జింక్, విటమిన్-ఇ వంటివి తోడ్పడతాయి. విటమిన్-డి కూడా పుష్కలంగా ఉంటుంది. శరీరానికి ఎండ తగలకపోవటం, సరైన పోషకాహారం తీసుకోకపోవటం వల్ల ప్రస్తుతం అత్యధికులు విటమిన్-డి లోపంతో బాధపడుతున్నారు. గుడ్డులో ఉండే అమైనో ఆమ్లాలు అధికంగా శారీరక శ్రమ చేసిన వారు తిరిగి శక్తిని పుంజుకోవటానికి ఉపయోగపడతాయి. కాలేయ జబ్బులు, ధమనులు, నాడీ సమస్యలు ఎదురుకాకుండా చూసేందుకు గుడ్డులో ఉన్న కోలిన్ పనిచేస్తుంది. గర్భిణులకు కాల్షియం గుడ్డు ద్వారానే అందుతుంది. సల్ఫర్, పలు రకాల విటమిన్లు, లవణాల వల్ల జట్టుకి మంచి పోషణ

కూడా అందుతుంది. ఉడికించిన గుడ్డులో విటమిన్-డితోపాటు మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. గోళ్లు పొడిబారిపోకుండా కాపాడతాయి. ఒక గుడ్డు తినటం వల్ల సుమారుగా 70 నుంచి 80 క్యాలరీలు, 6 గ్రాముల ప్రొటీన్లు, 5 గ్రాముల కొవ్వులు, 190 గ్రాముల కొలెస్ట్రాల్ శరీరానికి అందుతాయి.

సినీ రచయిత శ్రీరామకృష్ణ కన్నుమూత

ప్రముఖ సినీ రచయిత శ్రీరామకృష్ణ (74) కన్నుమూశారు. ఆయన ఆరోగ్యం క్షీణించటంతో సోమవారం రాత్రి 8 గంటలకు చెన్నైలోని తేనాంపేటలోని అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి. 50 ఏళ్ల కిందట చెన్నైలో స్థిరపడ్డారు. ఆయనకు భార్య స్వాతి, కుమారుడు గౌతమ్ ఉన్నారు. ప్రముఖ నటుడు రజనీకాంత్‌కు డబ్బింగ్ చెప్పే గాయకుడు మనోను ఆయనకు పరిచయం చేసింది శ్రీరామకృష్ణే. 300కుపైగా డబ్బింగ్ చిత్రాలకు రచయితగా పనిచేశారు. చివరిగా రజనీకాంత్ 'దర్బార్' సినిమాకు డైలాగులు రాశారు. గతంలో బొంబాయి, జెంటిల్‌మెన్, చంద్రముఖి వంటి చిత్రాలకు అనువాద రచయితగా పనిచేశారు. బాలమురళీ ఎంఎ, సమాజంలో స్త్రీ చిత్రాలకు దర్శకత్వం వహించారు. దర్శకులు మణిరత్నం, శంకర్ అన్ని చిత్రాలకు మాటలు అందించారు. రామకృష్ణ మృతదేహానికి మంగళవారం ఉదయం సాలిగ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.

టిడ్కో లబ్ధిదారుల ఆనందం ఆవిరి

- ఒక్కో ఇంటిపై రూ.7.55 లక్షల నుంచి రూ.8.55 లక్షల అప్పు
- గుడివాడలో లబ్ధిదారులకు బ్యాంకుల నోటీసులు
- 7,325 మందిపై రూ.616.62 కోట్ల భారం

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

టిడ్కో కాలనీల్లోకి గృహ ప్రవేశాల చేసిన ఆనందం ఏడు నెలలు కూడా నిలవలేదు. గతంలో తాము నివసించిన గృహాలకు చెల్లించిన అద్దె కన్నా అధిక మొత్తంలో బ్యాంకులకు నెల నెలా కిస్తీలు చెల్లించాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. కృష్ణా జిల్లా గుడివాడ పట్టణ సమీపంలోని మల్లాయపాలెంలో నిర్మించిన టిడ్కో కాలనీలో రెండు కేటగిరీలకు చెందిన 7,325 మంది లబ్ధిదారులపై రూ.616.62 కోట్ల భారం పడింది. దీంతో, లబ్ధిదారులు గృహ బకాయిలను పూర్తిగా రద్దు చేయాలని, అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి తమ ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

మల్లాయపాలెంలో రాష్ట్రంలోనే అతి పెద్ద టిడ్కో లే అవుట్లో 8,912 గృహాలను గతేడాది జూన్ 16న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. జి ప్లస్ త్రీ నమూనాలో 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల్లో మూడు కేటగిరీల్లో గృహాలు నిర్మించారు. 365 చదరపు అడుగుల గృహానికి రూ.7.55 లక్షలు చొప్పున, 430 చదరపు అడుగుల గృహానికి రూ.8.55 లక్షలు చొప్పున వడ్డీతో సహా లబ్ధిదారులు బ్యాంకులకు చెల్లించాల్సి వస్తోంది. లబ్ధిదారుని వయసు ఆధారంగా బ్యాంకులు కిస్తీలను నిర్ణయించాయి. బకాయిల చెల్లించాలని నోటీసులు ఇస్తున్నాయి. వయస్సు ఎక్కువ ఉన్న వారి నెలవారీ కిస్తీల సంఖ్యను బ్యాంకులు తగ్గించాయి. దీంతో, అటువంటి వారు అధిక మొత్తంలో కిస్తీ చెల్లించాల్సి వస్తోంది. 365 చదరపు అడుగుల గృహానికి నెలనెలా రూ.3 వేల నుంచి 4 వేలు, 430 చదరపు అడుగుల గృహానికి రూ.5 వేల నుంచి 5,700 వరకు చెల్లించాలని బ్యాంకు నోటీసులు వస్తున్నాయి. ఈ కాలనీలో 430 చదరపు అడుగుల గృహాలకు సంబంధించి 6,336 మంది లబ్ధిదారులు రూ.541.72 కోట్లు, 365 చదరపు అడుగుల గృహాలకు సంబంధించి 992 మంది లబ్ధిదారులు రూ.74.89 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ భారం మోయలేమని, ఈ బకాయిలను రద్దు చేయాలని కోరుతూ గుడివాడ అసెంబ్లీ వైసిపి అభ్యర్థి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని)కు, టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాములుకు గుడివాడ టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ వినతిపత్రాలు ఇచ్చింది.

వైసిపి, టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో చేయాలి

గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గుడివాడ వచ్చిన వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి టిడ్కో గృహాలపై రూ.3 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, 360, 430 చదరపు అడుగుల్లో గృహాలకు సంబంధించి రెండు కేటగిరీల్లో లబ్ధిదారులకు ఒక్క రూపాయి రుణమూ మాఫీ చేయలేదు. గృహ లబ్ధిదారులకు అప్పు భారంగా మారింది. టిడ్కో గృహ లబ్ధిదారులకు రుణ మాఫీ చేస్తామని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించాలి.

-గుడివాడ టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సంగమ్మ, బసవ అరుణ

ఇంటి అప్పు మాఫీ చేయాలి

నేను కూలి పనులకు వెళతాను. నా భర్త హోటల్‌లో సప్లయిర్‌గా పనిచేస్తారు. నాకు ఇటీవల నడుముకు పెద్దాపరేషన్ అయ్యింది. మా ఇద్దరికీ షుగర్, బిపి ఉన్నాయి. నెలనెలా మందులకు రూ.4 వేలు ఖర్చవుతోంది. గతంలో ఇంటి అద్దెకు నెలనెలా రూ.1,800 కట్టాము. బ్యాంకు అధికారులు టిడ్కో ఇంటికి నెలనెలా రూ.3 వేల చొప్పున 20 ఏళ్లపాటు రూ.7.50 లక్షలు చెల్లించాలంటున్నారు. కుటుంబం గడవడానికే కష్టంగా ఉంది. ఇంటి అప్పును ప్రభుత్వం మాఫీ చేయాలి.

-అక్కిశెట్టి రాజేశ్వరి, గుడివాడ, టిడ్కో గృహ లబ్ధిదారు

బ్యాంకు కిస్తీ కట్టలేను

మిషన్ కుట్టుకుని జీవనం సాగిస్తున్నాం. 60 ఏళ్ల వయస్సులో కుట్టు మిషన్ ద్వారా వచ్చే కొద్దిపాటి ఆదాయం పొట్ట నింపుకోవడానికే చాలడం లేదు. టిడ్కో ఇల్లు రాక ముందు గుడివాడ కాలువ వద్ద రేకుల షెడ్‌కు నెలనెలా రూ.1200 అద్దె చెల్లించాం. టిడ్కో ఇంటికి 20 ఏళ్ల పాటు నెలనెలా రూ.5 వేల చొప్పున మొత్తం రూ.8.50 లక్షలు చెల్లించాలని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఒకసారి మాత్రమే కిస్తీ చెల్లించాను. కిస్తీలు కట్టగలిగే పరిస్థితిలో లేను.

-మద్దాలి దుర్గ, గుడివాడ, టిడ్కో గృహ లబ్ధిదారు

మయాంక్ మాయ

- బెంగళూరుపై 28పరుగుల తేడాతో నెగ్గిన లక్నో
- డికాక్ అర్ధసెంచరీ

బెంగళూరు: చిన్నస్వామి స్టేడియంలో ఆతిథ్య బెంగళూరు జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. ఇంతకుముందు మ్యాచ్‌లో కోల్‌కతా చేతిలో 7వికెట్ల తేడాతో ఓడిన బెంగళూరు జట్టు మంగళవారం లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో 28పరుగుల తేడాతో ఓడింది. తొలుత లక్నో ఓపెనర్ క్వింటన్ డికాక్(81) అర్ధసెంచరీకి తోడు చివర్లో నికోలస్ పూరన్(40నాటౌట్; 20బంతుల్లో ఫోర్, 5సిక్సర్లు) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. టాప్లే వేసిన 19వ ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లతో లక్నోకు భారీస్కోర్ అందించాడు. దాంతో లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 181పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. తొలుత ఆర్సీబీ బౌలర్లకు లక్నో ఓపెనర్లు కేఎల్ రాహుల్(20), డికాక్(81)లు చుక్కలు చూపించారు. మ్యాక్స్‌వెల్ తన స్పిన్ మాయాజాలంతో రాహుల్‌ను ఔట్ చేసి ఆర్సీబీకి బ్రేక్ ఇచ్చాడు. మరో ఎండ్‌లో తొలి ఓవర్ నుంచి ధాటిగా ఆడుతున్న డికాక్ ఐపీఎల్‌లో 22వ అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. వీళ్లిద్దరూ మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యంతో లక్నోను ఆదుకున్నారు. ధాటిగా ఆడుతున్న మార్కస్ స్టోయినిస్(24)ను మ్యాక్స్‌వెల్ ఔట్ చేశాడు. దేవ్‌దత్ పడిక్కల్(6) స్వల్ప స్కోరకే వెనుదిరిగాడు. 20 బంతుల్లో ఐదు సిక్సర్లతో 40 పరుగులు చేసి లక్నోకు భారీ స్కోర్ అందించాడు. దీంతో లక్నో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. బెంగళూరు బౌలర్లలో మ్యాక్స్‌వెల్‌కు రెండు, సిరాజ్, దయాల్, టోప్లీలకు ఒక్కో వికెట్

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మయాంక్ యాదవ్(3/14)

దక్కాయి. ఛేదనలో బెంగళూరు టాపార్డర్ బ్యాటర్లు కోహ్లి(22), డుప్లెసిస్(19), పటీధర్(29) మాత్రమే రాణించగా.. చివర్లో లోమ్రోర్(33) ఫర్వాలేదని పించాడు. మిగిలిన బ్యాటర్లంతా నిరాశపరిచారు. దీంతో బెంగళూరు జట్టు 19.4ఓవర్లలో 153పరుగులకే కుప్పకూలింది. లక్నో బౌలర్లు మయాంక్‌కు మూడు, నవీన్‌కు రెండు, సిద్ధార్థ్, యశ్, స్టొయినీస్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మయాంక్ యాదవ్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి)మయాంక్ దగర్ (బి)టోప్లీ 81, కెఎల్ రాహుల్ (సి)మయాంక్ దగర్ (బి)మ్యాక్స్‌వెల్ 20, దేవదత్ పడిక్కల్ (సి)అనుజ్ రావత్ (బి)సిరాజ్ 6, స్టొయినీస్ (సి)మయాంక్ దగర్ (బి)మ్యాక్స్‌వెల్ 24, పూరన్ (నాటౌట్) 40, ఆయుష్ బదోని (సి)డుప్లెసిస్ (బి)యశ్ దయాల్ 0, కృనాల్ పాండ్యా (నాటౌట్) 0, అదనం 10. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 181పరుగులు. **వికెట్ల పతనం:** 1/53, 2/73, 3/129, 4/143, 5/148 **బౌలింగ్:** టోప్లీ 4-0-39-1, యశ్ దయాల్ 4-0-24-1, సిరాజ్ 4-0-47-1, మ్యాక్స్‌వెల్ 4-0-23-2, మయాంక్ దగర్ 2-0-23-0, గ్రీన్ 2-0-25-0

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి)పడిక్కల్ (బి)సిద్ధార్థ్ 22, డుప్లెసిస్ (రనౌట్) పడిక్కల్ 19, పటీధర్ (సి)పడిక్కల్ (బి)మయాంక్ యాదవ్ 29, మ్యాక్స్‌వెల్ (సి)పూరన్ (బి)మయాంక్ యాదవ్ 0, గ్రీన్ (బి)మయాంక్ యాదవ్ 9, అనుజ్ రావత్ (సి)పడిక్కల్ (బి)స్టొయినీస్ 11, లోమ్రోర్ (సి)పూరన్ (బి)యశ్ ఠాకూర్ 33, దినేశ్ కార్తీక్ (సి)రాహుల్ (బి)నవీన్-ఉల్-హక్ 4, మయాంక్ దగర్ (రనౌట్)పూరన్ 4, టోప్లీ (నాటౌట్) 3, సిరాజ్ (సి)పూరన్ (బి)నవీన్-ఉల్-హక్ 12. అదనం 11. (19.4ఓవర్లలో ఆలౌట్) 153పరుగులు. **వికెట్ల పతనం:** 1/40, 2/42, 3/43, 4/58, 5/94, 6/103, 7/136, 8/137, 9/138, 10/153 **బౌలింగ్:** సిద్ధార్థ్ 3-0-21-1, కృనాల్ పాండ్య 1-0-10-0, నవీన్-ఉల్-హక్ 3.4-0-25-2, మయాంక్ యాదవ్ 4-0-14-3, రవి బిష్ణోయ్ 3-0-33-0, యశ్ ఠాకూర్ 4-0-38-1, స్టొయినీస్ 1-0-9-1.

మా పొరపాటుతోనే ఇంగ్లండ్‌కు వన్డే ప్రపంచకప్

మాజీ అంపైర్ షాకింగ్ కామెంట్స్

లండన్: 2019 ఐసిసి వన్డే ప్రపంచకప్ ఛాంపియన్ ఇంగ్లండ్‌పై మాజీ అంపైర్ ఎరాస్మస్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. ఇటీవల అంపైరింగ్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన మరాయిస్ ఎరాస్మస్ తమ పొరపాటుతోనే ఇంగ్లండ్ విశ్వ విజేతగా నిలిచిందని చెప్పుకొచ్చాడు. 'న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్లో బెన్ స్టోక్స్ బ్యాట్ తగిలడంతో బంతి బౌండరీకి వెళ్లింది. దాంతో, నేను కుమర ధర్మసేన కాసేపు చర్చించి ఆరు పరుగులు ఇచ్చాం. అయితే.. మరుసటి రోజు ఉదయం ధర్మసేన 'మనం పెద్ద తప్పు చేశాం' అన్నాడు. ఇద్దరం సిక్స్, సిక్స్, అవును సిక్స్ అని సిగ్నల్ ఇచ్చాం. కానీ, ఐదు పరుగులే ఇవ్వాల్సింది' అని ఎరాస్మస్ తెలిపాడు. ఐసిసి రూల్స్ ప్రకారం బ్యాటర్ పరుగు పూర్తి చేశాక ఓవర్ త్రోకు పరుగులు ఉండవు. ఒకవేళ పరుగు తీస్తున్న క్రమంలో బంతి ఓవర్ త్రో కారణంగా బంతి బౌండరీకి వెళ్తే అదనంగా 4పరుగులు ఇవ్వాలి. కానీ, ఈ నియమాలు పాటించని ఎరాస్మస్, ధర్మసేనలను అంపైర్ సైమన్ టైఫెల్ తీవ్రంగా విమర్శించిన సంగతి తెలిసిందే.

టి20 ప్రపంచకప్‌కు బెన్ స్టోక్స్ దూరం

లండన్: టి20 ప్రపంచ కప్‌కు ముందు డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌కు గట్టి షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ మెగా టోర్నీ నుంచి వైదొలిగాడు. ఈ ఏడాది జరిగే టి20 ప్రపంచకప్ నుంచి స్వచ్ఛందంగా తప్పుకుంటున్నట్టు మంగళవారం ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డులు వెల్లడించాయి. మోకాలి సర్జరీ నుంచి పూర్తిగా కోలుకోవడంతో పాటు బౌలింగ్‌పై దృష్టి పెట్టేందుకు స్టోక్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. 2022లో పాకిస్తాన్‌తో జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్ జట్టు రెండోసారి టి20 ప్రపంచకప్ విజేతగా అవతరించింది. గాయం నుంచి కోలుకున్న స్టోక్స్ వన్డేలు, టి20లకే ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించుకోగా.. మోకాలి సర్జరీ నుంచి పూర్తిగా కోలుకోవడం కోసం టి20 ప్రపంచకప్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. 2024 జూన్ 1నుంచి టి20 ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. ఈసారి అమెరికా, వెస్టిండీస్‌లు మెగా టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి.

ఓటమి అంచుల్లో బంగ్లాదేశ్

ఢాకా: శ్రీలంకతో జరుగుతున్న రెండో, చివరి టెస్ట్‌లోనూ ఆతిథ్య బంగ్లాదేశ్ జట్టు ఓటమి అంచుల్లో నిలిచింది. 511పరుగుల భారీ ఛేదనలో భాగంగా మంగళవారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ జట్టు ఆట ముగిసే సమయానికి 7వికెట్ల నష్టానికి 268పరుగులు చేసింది. విజయానికి ఆ జట్టు మరో 243పరుగులు చేయాల్సి ఉండగా.. మరో మూడు వికెట్లు పడగొడితే శ్రీలంకకు విజయం దక్కనుంది. శ్రీలంక బౌలర్లు పేసర్ లాహిరు కుమార, స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య, పార్ట్‌టైమ్ బౌలర్ కమిందు మెండీస్ రెండేసి వికెట్లతో రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 531 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్ 178పరుగులకే కుప్పకూలింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక 7వికెట్ల నష్టానికి 157పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68